

తెల్లవారుజామున 3.30 నుంచి శ్రీహరి ఉత్తరద్వార దర్శనం

కదిరి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర గోపురం ద్వారా స్వామి దర్శనం తెల్లవారుజామున 3.30 గంటలకే ప్రారంభమవుతుందని ఈఓ శ్రీనివాసరెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. 10న తెల్లవారుజామున స్వామివారికి నిత్యకైంకర్యాలు నిర్వహిస్తామన్నారు. 3.30 గంటలకు భక్తులకు స్వామివారు దర్శనమిస్తారన్నారు. ఉచిత, ప్రత్యేక దర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు.

ఆదుకోకుంటే

ఆత్మహత్యే శరణ్యం

కరువు బృందం ఎదుట రైతుల ఆవేదన



తాడిమర్రి వద్ద ఉలవ పంటను పరిశీలిస్తున్న కేంద్ర కరువు బృందం సభ్యుడు పొన్నుస్వామి

ముదిగుబ్బ/తాడిమర్రి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): గత ఖరీఫ్‌లో పంటలు సాగుచేసి, వర్షాభావంతో తీవ్రంగా నష్టపోయామనీ, ప్రభుత్వాలు ఆదుకోకుంటే ఆత్మహత్యే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఆదుకునేలా ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాలని కేంద్ర కరువు బృందానికి విన్నవించుకున్నారు ముదిగుబ్బ మండలంలోని జొన్నలకొత్తపల్లి, తాడిమర్రి మండలంలో కరువు బృందం సభ్యులు జయంతి కనోజియా, పొన్నుస్వామి బుధవారం పర్యటించారు. తొలుత ముదిగుబ్బ మండలం జొన్నలకొత్తపల్లిలో కంది, ఉలవ, జొన్న పంటలను బృందం సభ్యులు పరిశీలించారు. అనంతరం రైతులతో ముఖాముఖి నిర్వహించి, సమస్యలపై ఆరాతీశారు. కంది పంటకు గిట్టుబాటు ధర కల్పించాలనీ, ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలనీ, సాగునీటి, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఏటా అతివృష్టి, అనావృష్టితో పంటలు చేతికి అందక అన్నదాతలు అప్పులపాలవుతున్నామన్నారు. ఆత్మహత్య చేసుకునే దుస్థితి దాపురించిందన్నారు. జొన్నలకొత్తపల్లికి చెందిన రైతు విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో పదెకరాలల్లో వేరుశనగ సాగు చేశాననీ, దాదాపు రూ.3 లక్షలు పెట్టుబడి పెట్టానన్నాడు. రూ.60వేలు మాత్రమే చేతికి వచ్చిందన్నాడు. ప్రభుత్వం ఆదుకునేలా చూడాలని వేడుకున్నారు. రైతు తేజ్‌దీప మాట్లాడుతూ.. మూడెకరాల్లో కందిపంట సాగుచేశాననీ, రూ.60వేల వరకు పెట్టుబడి వచ్చిందన్నాడు. దిగుబడి రాక పంటను పశువులకు వదిలేశానని వాపోయాడు. అనంతరం పలు సమస్యలపై రైతులు.. కేంద్రబృందం సభ్యులకు వినతులు సమర్పించారు.

పెట్టుబడి సాయం అందించాలి..

అనంతరం తాడిమర్రి మండలంలోని మేడిమాకులపల్లికి చేరుకున్నారు. గ్రామానికి చెందిన రైతు భాస్కర్ ఖరీఫ్‌లో వర్షాధారంగా సాగు చేసి, ఎండిపోయిన ఉలవపంటను పరిశీలించారు. తాడిమర్రి సమీపంలో జొన్న పంటను పరిశీలించారు. మండల కేంద్రంలోని రైతు సేవాకేంద్రంలో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. మేడిమాకుల పల్లి వద్ద రైతులతో ముఖాముఖి నిర్వహించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆరాతీశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. పంట పెట్టుకోవడానికి ఉచితంగా విత్తనాలు పంపిణీ చేయాలన్నారు. పంట నష్టపోయిన వారికి పరిహారం, పెట్టుబడికి సాయం చేయాలని కోరారు. రైతు పంట సాగుచేయడానికి ఎంత ఖర్చు చేశారు, ఎంత దిగుబడి సాధించారు, ఎంత నష్టపోయారు అన్న విషయాలను బృందం సభ్యులు నమోదు చేసుకున్నారు. వారి వెంట ధర్మవరం ఆర్డీఓ మహేశ్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, జిల్లా ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్, వ్యవసాయ సంఘం నాయకులు జంగాలపల్లి పెద్దన్న, కాటమయ్య పాల్గొన్నారు.


నేడు మెగా జాబ్‌మేళా

ధర్మవరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతి సందర్భంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సీఎన్‌బీ కల్యాణమండపంలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు బీజేపీ కార్యాలయ సిబ్బంది బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30గంటలకు మేళా ప్రారంభమవుతుందన్నారు. 90 కంపెనీలు పాల్గొంటాయన్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరవుతున్నారన్నారు.

అభివృద్ధి బాటలు..







ప్రధాన మంత్రి ప్రారంభించిన బత్తలపల్లి -ముదిగుబ్బ 42వ నంబరు జాతీయ రహదారి

- బత్తలపల్లి-ముదిగుబ్బ నాలుగు వరుసల రహదారి ప్రారంభం
- మడకశిర-శిర రోడ్డు సైతం.. తప్పిన ట్రాఫిక్ బెడద తగ్గిన ప్రయాణ సమయం



ముదిగుబ్బ-బత్తలపల్లి జాతీయ రహదారి



మడకశిర-శిర రహదారి

పుట్టపర్తి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పరంగా జిల్లా దూసుకెళ్తోంది. అంతర్జాతీయ కార్ల పరిశ్రమ కియ, అనుబంధ సంస్థల ఏర్పాటుతో పారిశ్రామిక హబ్‌గా మారిపోయింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. ఈ తరుణంలో రహదారుల అనుసంధానం ముఖ్యం. ఆ దిశగా నాలుగు వరుసల రహదారులు సిద్ధమయ్యాయి. వాటిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బుధవారం వైజాగ్ వేదికగా ప్రారంభించారు. ఒకప్పుడు నరకానికి నకళ్లగా ఉన్న రోడ్లను అత్యంత సౌకర్యవంతంగా తీర్చిదిద్దారు. వందల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఈ రోడ్లను ప్రధాని జాతికి అంకితం చేశారు. అనంతపురం-కదిరి మార్గంలోని బత్తలపల్లి, ముదిగుబ్బ మధ్య ప్రయాణం అంటే నరకం కనిపించేది. ప్రతి అర కిలోమీటరుకు మలుపు, ఆపై ప్రమాదాలతో మృత్యురహదారిగా ఉండేది. వాహనాల రద్దీ విపరీతంగా ఉన్నప్పటికీ రెండు వరుసలతో ఇబ్బందికరంగా ఉండేది. తరచూ వాహన ప్రమాదాలు జరుగుతూ ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లేది. నరక కూపంగా ఉన్న ఈ 33 కిలోమీటర్ల మార్గంలో ప్రయాణించాలంటే గంటన్నర సమయం పట్టేది. ఈ రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించారు. ఆ రహదారిని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. ప్రజలకు అంకితం చేశారు. 44వ జాతీయ రహదారి నుంచి అనంతపురం, బత్తలపల్లి, ముదిగుబ్బ మీదుగా చెన్నై వెళ్లే 42వ జాతీయ రహదారి విస్తరణ పూర్తి కావడంతో ప్రయాణాలకు ఎంతో సౌకర్యవంతంగా మారింది. బత్తలపల్లి బైపాస్, ముదిగుబ్బ, ముదిగుబ్బ బైపాస్ నిర్మాణంతో 33 కిలోమీటర్ల రెండు లేన్ల రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించేందుకు జాతీయ రహదారులు, రవాణా కేంద్ర మంత్రిత్వ శాఖ రూ.535.99 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టింది. ముదిగుబ్బ బైపాస్ 7.75 కిలోమీటర్ల రోడ్డును రూ.116.81 కోట్లతో పూర్తిచేసింది. బత్తలపల్లి వద్ద కూడా బైపాస్ నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారమైంది.

రికార్డు సమయంలో పూర్తి

మడకశిర నుంచి కర్ణాటకలోని శిర వరకు ఉన్న సింగిల్ రోడ్డును 544ఇ జాతీయ రహదారిగా మార్చి రెండు లేన్లతో 42.38 కిలోమీటర్ల రోడ్డును రూ.207.29 కోట్లు ఖర్చు చేసి విస్తరించారు. చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టు నుంచి మడకశిర మీదుగా కర్ణాటకలోని శిర వరకు గతంలో సింగిల్ లేన్ రోడ్డు ఉండేది. దీనిని నాలుగులేన్ల రహదారిగా విస్తరించడంతో ప్రయాణం సులభతరంగా మారింది. గతంలో మడకశిర నుంచి శిర వరకు ప్రయాణం చేయాలంటే రెండు గంటల సమయం పట్టేది. ఇప్పుడు రోడ్డు విస్తరణతో 45 నిమిషాల్లోనే చేరుకోగలుగుతున్నారు. 2023 ఫిబ్రవరిలో ఈ రోడ్డు పనులు ప్రారంభమై 2024 ఆగస్టు నెలకి పూర్తి చేశారు. అతి తక్కువ సమయంలో పూర్తి కావడం విశేషం. గతంలో ఉన్న రెండు వరుసల రహదారిలో మలుపులు, గతుకులు అధికంగా ఉండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతుండేవి. ప్రస్తుతం రోడ్లు విస్తరించడంతో మలుపులు, ట్రాఫిక్, గతుకుల కష్టాలు తీరిపోయాయని వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహిళల పొదుపు మటాష్..!

ద్వాక్రా సంఘాల డబ్బు స్వాహా

- ఫోర్జరీ సంతకాలతో కాజేస్తున్న యానిమేటర్లు
- ఆనక పరారవుతున్న వైనం
- రోడ్డెక్కుతున్న బాధితులు
- రికవరీ పట్టని అధికారులు



అమరాపురం ఐకేపీ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న వీరాపురానికి చెందిన మహిళలు (ఫైల్)

మడకశిరటౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మహిళ ఆర్థిక స్వావలంబనతోనే కుటుంబ ప్రగతి ఆధారపడి ఉంటుందని పాలకులు నొక్కిచెబుతున్నారు. ఆ దిశగా పలు పథకాలు అమలు చేస్తున్నారు. అందులో ప్రధానమైనది డ్వాక్రా సంఘాలు. మహిళల పొదుపును ప్రోత్సహించి, ఆర్థిక సాధికారత సాధించేలా చేయడమే ప్రభుత్వ ఉద్దేశం. అది క్షేత్రస్థాయిలో యానిమేటర్ల అక్రమాల కారణంగా నీరుగారిపోతోంది. నియోజకవర్గంలోని పలు మండలాల్లో గ్రామైక్య సంఘాల్లో యానిమేటర్లు.. డ్వాక్రా సంఘాల సభ్యుల డబ్బు ఫోర్జరీ సంతకాలతో స్వాహా చేస్తున్నారు. దీంతో సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బు స్వాహా చేస్తూ యానిమేటర్లు పరారవుతున్నారు. మడకశిర మండలం కేఎస్ తండా గ్రామైక్య సంఘంలో 14 సంఘాలకు సంబంధించి రూ.23 లక్షలు అప్పటి సీసీ అండతో యానిమేటర్ దేవరాజు స్వాహా చేసి పరారైనట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. పోలీసు స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేశామనీ, ఇంతవరకు తమకు న్యాయం చేకూరలేదని వారు వాపోతున్నారు. అమరాపురం మండలంలోని వీరాపురం మమత గ్రామైక్య సంఘంలో 14 సంఘాల సభ్యుల డబ్బు దాదాపు రూ.20లక్షలు స్వాహా చేశారని, ఇటీవల సంఘం సభ్యులు ఐకేపీ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. యానిమేటర్ కిశోర్ తమకు తెలియకుండానే డబ్బు డ్రా చేసి, స్వాహా చేశాడని ఆరోపించారు. గుడిబండ మండలం పి.సి.గిరి గ్రామానికి చెందిన కల్పన గ్రామైక్య సంఘంలో 15 సంఘాలకు చెందిన రూ.13లక్షలు స్వాహా చేసి యానిమేటర్ సురేశ్ పరారయ్యాడంటూ బాధితులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏడాది క్రితం సంఘాల పరిధిలో స్వాహా జరిగినా ఇంతవరకు రికవరీ చేయలేదని మహిళలు వాపోతున్నారు. ఎంతో కష్టపడి పొదుపు చేసుకున్న డబ్బు స్వాహా చేయడం పట్ల మహిళా సంఘాల సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఐకేపీ అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రికవరీ పట్టని అధికారులు

మహిళా సంఘాల సొమ్మును యానిమేటర్లు స్వాహా చేస్తున్నా.. చర్యలు తీసుకోకుండా ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు. పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేసి వదిలేస్తున్నారు. రికవరీ ఊసే పట్టించుకోవట్లేదు. దీంతో వారి వైఖరిపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. వెరసి, సంఘాల సొమ్ము కాజేసిన యానిమేటర్లు దర్జాగా తిరుగుతున్నారని బాధిత మహిళలు వాపోతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం..

మడకశిర, అమరాపురం, గుడిబండ మండలాల పరిధిలోని గ్రామైక్య సంఘాల్లో స్వాహా అయిన డబ్బు రికవరీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. డబ్బు కొట్టేసిన వారు ఎక్కడున్నారో గుర్తించాం. త్వరలో పోలీసుల సహకారంతో వారి నుంచి నిధులు రికవరీ చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- నాగరాజు, ఐకేపీ ఏరియా కోఆర్డినేటర్

పట్టుబడింది నకిలీ మద్యమే?

11 మంది బెల్టుషాపు నిర్వాహకుల అరెస్టు

హిందూపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఎక్సైజ్ అధికారుల దాడుల్లో పట్టుబడిన మద్యం నకిలీదని ఆ శాఖలోని ఓ ఉన్నతాధికారి ద్వారా తెలుస్తోంది. ఎక్సైజ్ అధికారులు ఈనెల 7న చిలమత్తూరు, లేపాక్షి, హిందూపురం మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వాహకుల ఇళ్లపై దాడులు చేశారు. ఇందులో లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రూ.99 మద్యం బాటిళ్లు నకిలీవి ఉన్నట్లు సమాచారం. ఇది ఎక్కడ, ఎవరు తయారు చేశారన్న దానిపై లోతుగా విచారణ చేస్తున్నారు. స్థానికంగా తయారుచేసి లేబుల్‌వేశారా, వేరే ప్రాంతం నుంచి నకిలీ మద్యం తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారా అనేది తెలియాల్సి ఉంది. 11 మంది బెల్టుషాపు నిర్వాహకులపై కేసు నమోదుచేసి, రిమాండ్‌కు పంపారు. 186 బాటిళ్ల నకిలీవని ఎక్సైజ్ అధికారులు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలుస్తోంది. శాంపిళ్లను ల్యాబ్‌కు పంపితే వాస్తవాలు వెలుగుచూస్తాయి. పట్టుబడిన వారి నుంచి 13 కేసుల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఆ వివరాలను మీడియాకు వెల్లడించేందుకు ముందుకు రాలేదు.

వామ్మో.. చిరుత..!

క్రిష్ణాపురం పరిసర ప్రాంతాల్లో సంచారం
భయాందోళనల్లో ప్రజలు

బుక్కపట్నం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్ణాపురం గ్రామ పరిసర ప్రాంతాల్లో మూడురోజులుగా చిరుత సంచరిస్తోంది. దీంతో జనం హడలెత్తిపోతున్నారు. మంగళవారం గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో మేకల మందపై దాడి చేసి, రెండింటిని చంపినట్లు కాపరి ఆదినారాయణ తెలిపాడు. బుధవారం పగలే గ్రామ సమీపంలోని కంది పంటలో చిరుత సంచరిస్తూ గ్రామస్థుల కంట పడింది. దీంతో క్రిష్ణాపురం పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. పొలాల వద్దకు వెళ్లాలంటే హడిలిపోతున్నారు. అటవీ అధికారులు.. చిరుతను బంధించాలని కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి విజిట్

సిద్దరాంపురం.. సమస్యల తోరణం

- అభివృద్ధి కోసం ఎమ్మెల్యే స్వగ్రామం ఎదురుచూపు
- గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయం
- ఇళ్లు, స్థలాల కోసం పేదల నిరీక్షణ
- చెరువు నింపాలని రైతుల వినతి
- నిరుద్యోగ సమస్య తీర్చాలంటున్న యువత

జిల్లా కేంద్రంలో కలగలిసినట్లు ఉండే మండలం బుక్కరాయసముద్రం. ఇందులోని ఓ పంచాయతీ సిద్దరాంపురం. ఈ గ్రామంలో దాదాపు ఏడు వందల ఇళ్లు ఉన్నాయి. మొత్తం జనాభా దాదాపు మూడు వేలు ఉన్నారు. ఇక్కడి ప్రజలకు పాడి, వ్యవసాయమే ప్రధానం. ప్రతి గ్రామంలో ఉన్నట్లే ఈ గ్రామంలోనే అనేక సమస్యలు ఉన్నాయి. ఈ ఊరి గురించే ఎందుకు ప్రత్యేకంగా చెప్పుకోవాల్సి వస్తోందంటే.. ఇది శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ స్వగ్రామం. తమ ఊరి ఆడబిడ్డ తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. సొంతూరిపై మమకారంతో ఇక్కడి సమస్యలు పరిష్కరిస్తారని ఆ ఊరి ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఎమ్మెల్యే తండ్రి బండారు రవికుమార్ స్వగ్రామం సిద్దరాంపురం. వృత్తి రీత్య కొన్నేళ్ల కిందట హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. తర్వాత కాలం అంటే 2014 నుంచి ఎమ్మెల్యేతో పాటు వారి కుటుంబ సభ్యులు స్వగ్రామం తో పాటు అనంతపురంలో నివసిస్తున్నారు. స్వగ్రామంలో సొంత ఇల్లు, భూమి ఉంది. ఈ నేపథ్యంలో ఆ గ్రామాన్ని 'ఆంధ్రజ్యోతి' బుధవారం సందర్శించింది. అక్కడి ప్రజలతో మాట్లాడి.. ఊరి పరిస్థితిని తెలుసుకుంది.

- ఆంధ్రజ్యోతి, బుక్కరాయసముద్రం





ప్రాథమిక పాఠశాల ఎదుటే మురుగునీటి కాలువ



గుంతలపడిన సిద్దరాంపురం ప్రధాన రహదారి

గుంతల రోడ్డే గతి

మండలకేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది సిద్దరాంపురం. పచ్చని పైరు పంటలు, పాడితో విలసిల్లిన గ్రామం కాలగతిలో వచ్చిన మార్పులకు తలవంచింది. ఎందరో పాలకులు మారిన గ్రామస్థితిగతులు మార్చలేకపోయారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా బుక్కరాయసముద్రం నుంచి సిద్దరాంపురం గ్రామానికి వెళ్లే ప్రధాన బీటీ రోడ్డు గుంతలమయంగా ఉంది. గ్రామానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సిందే. అనంతపురం నుంచి సిద్దరాంపురం వెళ్లడానికి గతంలో ఆర్టీసీ బస్సు ఉండేది. ప్రస్తుతం ఆ బస్సు సర్వీసు నడపడం లేదు.

స్థలాల కోసం ఎదురుచూపులు

ఎమ్మెల్యే స్వగ్రామంలో పక్కాగృహాలు, ఇంటి పట్టాలు కోసం ఎస్సీ, బీసీలు ఎదురు చూస్తున్నారు. ఇళ్ల లేకపోవడంతో చాలా మంది ఏళ్లగా చిన్న ఇంట్లోనే 8, 9 మంది నివాసం ఉంటున్నారు. దేవుడి మాన్యం భూమిలో ఇంటి పట్టాలు ఇవ్వాలని గతంలో అధికారులుకు పలు సార్లు విన్నవించినా పట్టించుకోలేదు. ఇంటి స్థలాలు కోసం, పక్కాగృహాలు కోసం గ్రామంలో దాదాపు వంద మందికిపైగా అర్హులు ఎదురు చూస్తున్నారు. ఎమ్మెల్యే చొరవ చూపి ఇంటి స్థలాలు, పక్కా గృహాలు ఇప్పించాలని కోరుతున్నారు. ఇప్పటికే గ్రామ సచివాలయంలో పక్కాగృహాలు కావాలని 20 మంది దరఖాస్తు చేసుకున్నారు.

రూ. 26 లక్షలతో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం బండారు శ్రావణీశ్రీ తన స్వగ్రామ పంచాయతీలో రూ.26 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో భాగంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మాణం చేపట్టారు. గ్రామంలో మరి కొన్ని పనులకు ప్రతిపాదనలు పంపారు.

చెరువుకు నీరు నింపితే.. వ్యవసాయం మరింత మెరుగు



సిద్దరాంపురం గ్రామ చెరువును నీటితో నింపితే వ్యవసాయం రంగం మరింత పుంజుకుంటుంది. హంద్రీనీవా ద్వారా, లేదా బుక్కరాయసముద్రం చెరువు ద్వారా నీరు నింపేలా ప్రభుత్వం చొరవ చూపాలి. మా ఎమ్మెల్యేకు చెరువు నీరు విషయం తెలిపాం. ఈ విషయంపై పోరాడి చేస్తానని చెప్పారు. చెరువులోకి నీరు వస్తే గ్రామంలోని వ్యవసాయ బోర్లు, తాగునీటి బోర్లలో భూగర్భజలాలు పెరుగుతాయి.

- సంజప్ప సిద్దరాంపురం

డెయిరీ ఏదీ..?

సిద్దరాంపురం గ్రామ పంచాయతీలో పాడిపరిశ్రమపై 150 కుటుంబాలకు పైగా ఆధార పడి జీవిస్తున్నారు. ప్రతి రోజూ వేల లీటర్లు ఈ గ్రామ పంచాయతీ నుంచి అనంతపురం తరలించి విక్రయిస్తుంటారు. ఇది చాలా వ్యయప్రయాసలతో కూడుకున్న పని. గ్రామ పంచాయతీలోనే ప్రభుత్వం ఓ డెయిరీని ఏర్పాటు చేసి, పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని పాడి రైతులు కోరుతున్నారు.

జాబ్‌మేళా నిర్వహించాలి: రాంప్రసాద్



నేను పీజీ వరకు చదివా. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు కోసం ప్రయత్నించి విఫలమయ్యా. దీంతో ఉన్న ఊరిలోనే ఇంటి వద్ద గాలి మిషన్ పెట్టుకుని జీవిస్తున్నా. నా భార్య నారక్క డిగ్రీ పూర్తి చేసింది. ఇద్దరం కలిసి గాలి మిషన్ ద్వారా బతుకుతున్నాం. మాకు పక్కా ఇల్లు కూడా లేదు. ఎమ్మెల్యే గారు ఏదైనా జాబ్ మేళా నిర్వహించి నిరుద్యోగ సమస్య పరిష్కారించాలి.



ఊరి కాలువ గట్టు మీద విద్యార్థుల నడక

ఇల్లు కూలిపోయింది..



2007లో ఇందిరమ్మ ఇల్లు కట్టుకున్నా. అయితే గతంలో కురిసిన వర్షాలకు అది నేలమట్టం అయ్యింది. ఐదేళ్ల నుంచి చిన్న బాడుగ ఇంట్లో ఉంటున్నా. పక్కా ఇంటి కోసం అధికారులు చుట్టూ తిరిగినా మంజూరు చేయలేదు. చిన్న ఇంటిలోనే నా ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె, మా అమ్మ, నా భార్య మొత్తం ఆరుగురు ఉంటున్నాం. చిన్న ఇంటిలో జీవనం ఇబ్బందిగా ఉంది. ఎమ్మెల్యేగారు కనికరించి నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు పక్కాగృహాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా.

- నారాయణస్వామి, సిద్దరాంపురం

చెరువుకు సాగునీరు... ఎమ్మెల్యేకు సవాల్

సిద్దరాంపురం గ్రామ చెరువును నీటితో నింపడం ఎమ్మెల్యేకు సవాల్‌తో కూడుకున్న పని. 2015లో ఈ చెరువును హంద్రీనీవా నీటితో నింపాలని టీడీపీ నేతలు ప్రయత్నాలు చేశారు. రూ.30లక్షలతో సప్లై చానల్ పనులు కూడా చేపట్టారు. అయితే సాంకేతికపరమైన చిక్కులు రావడంతో పనిని ఆపివేశారు. ప్రస్తుతం బుక్కరాయసముద్రం చెరువు ద్వారా ఓ సప్లై చానల్ ఏర్పాటు చేసి, దాని ద్వారా సిద్దరాంపురం చెరువును నింపాలని ఆ గ్రామంలోని రైతులు గతంలో అధికారులను కోరారు. ఇందుకు రూ. 10 కోట్ల పైగా ఖర్చు అవుతుందని ఇరిగేషన్ అధికారులు అంచనాలు వేయడం జరిగింది. మరి ఇంత మొత్తం ఒక్క పంచాయతీకే రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరు చేయించి, చెరువును నీటితో నింపడం ఎమ్మెల్యేకు సవాల్‌తో కూడుకున్న విషయమే.

ఊరి కాలువ సమస్య

గ్రామంలో నిరుద్యోగ సమస్య, ఎస్సీ, బీసీలుకు ఇంటి స్థలా లు, పక్కాగృహాలు సమస్య తీవ్రంగా ఉంది. వీటితో పాటు రైతులు అనేక సంవత్సరాల నుంచి గ్రామంలో ఉన్న చెరువుకు సాగునీరు అందిస్తుందని రైతులు ఎదురు చూపులు చూ స్తున్నారు. గతంలో వేసి న రోడ్లు, డ్రైనేజీ కాలువల సమస్య పెద్దగా లేకపోయినా, ఎస్సీకాలనీ, ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న ఊరి కాలువ సమస్య తీవ్రంగా ఉంది. గ్రామ పంచాయతీ హాబిటేషన్ గ్రామం అయిన ఏ కొండాపురం గ్రామంలో తాగునీటి సమస్య ఉంది. ఈ గ్రామ పంచాయతీలో దాదాపు పాడి పరిశ్రమం మీద దాదాపు 150 కుటుంబాలు పైగా ఆధార పడి జీవనం సాగిస్తున్నాయి. స్థానికంగా డెయిరీ లేకపోవడంతో ప్రతి నిత్యం పాలను అనంతపురం తెచ్చి విక్రయించాల్సిన పరిస్థితి. ఇలా ఎమ్మెల్యే స్వగ్రామంలో సమస్యలు అనేకం ఉన్నాయి. రానున్న ఐదేళ్ల కాలంలో ఎమ్మెల్యే సొంతూరి సమస్యలపై దృష్టి పెట్టి, గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుందని ప్రజలు ఎదురు చూపులు చూస్తున్నారు.

నిరుద్యోగ సమస్య తీవ్రం

ఎమ్మెల్యే స్వగ్రామంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. గ్రామంలో ఇంటర్, డిగ్రీ, పీజీ చేసిన యువత అనేక మంది ఖాళీగా ఉన్నారు. గ్రామంలో ఏదైనా ఫ్యాక్టరీ పెట్టడం లేదా జాబ్‌మేళా నిర్వహించి ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు కోరుతున్నారు.

రేపటి నుంచే సంక్రాంతి సెలవులు

అనంతపురం విద్య, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని స్కూళ్లకు శుక్రవారం నుంచి సంక్రాంతి పండుగ సెలవులు ప్రకటించినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారని ఆయన పేర్కొన్నారు. 2024-25 అకడమిక్ క్యాలెండర్ మేరకు ఈ నెల 10 నుంచి 19వ తేదీ వరకూ స్కూళ్లకు సెలవులు ఉంటాయన్నారు. సెలవుల్లో 10వ తరగతి విద్యార్థులు యాక్షన్ ప్లాన్ మేరకు 10 నుంచి 12 తేదీ వరకూ, 16 నుంచి 19వ తేదీ వరకూ పరీక్షలకు సెల్ఫ్ ప్రిపరేషన్ కావాలని సూచించారు. 20వ తేదీ స్కూళ్ల పునఃప్రారంభమవుతాయన్నారు. మైనార్టీ విద్యాసంస్థలకు ఈనెల 11 నుంచి 15 వరకూ సెలవులు ఉంటాయని డీఈఓ పేర్కొన్నారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల

గుంతకల్లు టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీశంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం సెమిస్టర్ పరీక్ష ఫలితాలను ఎస్కే యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు బుధవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కళాశాలకు అటానమస్ హోదా వచ్చిన తరువాత తొలిసారిగా సెమిస్టర్ పరీక్షలు డిసెంబరు 2024లో నిర్వహించారన్నారు. ఈ పరీక్షలను మొత్తం 425 మంది రాయగా 338 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని వెల్లడించారు. ఈకార్యక్రమంలో కళాశాల చైర్మన్ డీపీ మురళీకృష్ణ, డైరెక్టర్ గోపాల్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు సురేష్‌బాబు, గోపి, కురిపాటి రాకేష్, తదితరులుపాల్గొన్నారు.

ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో... పట్టణంలోని ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో బుధవారం కళాశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత్‌గుప్త ఆధ్వర్యంలో డిగ్రీ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. మొత్తం 304 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 183 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, వైస్‌ప్రిన్సిపాల్ ఓబులేసు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

70 ధాన్యం బస్తాలు లాగిన ఒంటెద్దు



ఒంటెద్దు బండిపై ధాన్యం బస్తాలను తరలిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) కాడెద్దుల సేద్యం కనుమరుగవుతోంది. మేడిపట్టే రైతు మాయమవుతున్నాడు. ఇలాంటి తరుణంలో ఒక రైతు తన ఒంటెద్దుతో ఐదు బండ్లలోనిల్లో 70 వరి ధాన్యం బస్తాలను ఒక కిలోమీటర్ వరకు లాగించి ఔరా అనిపించాడు. ఈ సంఘటన మండలంలోని దేవగిరి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన రైతు దేవప్పగారి ఆంజనేయులు తన తోటి రైతులతో సరదాగా తన ఎద్దు సామర్థ్యం గురించి మాట్లాడాడు. ఈక్రమంలోనే ఒంటెద్దుతో 70 ధాన్యం బస్తాలు తరలించడానికి పూనుకున్నాడు. తను ఒంటెద్దుకు జతగా కాడిమానుకు ఒక పక్క ఉండి 70 ధాన్యం బస్తాలు వేసుకొని వచ్చారు. దీన్ని చూసేందుకు ఊరంతా వచ్చారు. ఎద్దు కూడా ఏమాత్రం అలసలేకుండా బండిలాగింది. రైతు ఆంజనేయులు పక్కన మరికొంత మంది ఉండి బండిని తోయించారు. రైతు చేసిన ఈ సాహసాన్ని టీడీపీ నాయకులు అప్పారావు, గ్యాస్ గోవింద అభినందించారు.

అభిమానులూ.. జాగ్రత్త

- బాలకృష్ణ ఫ్యాన్స్‌కు ఎమ్మెల్యే దగ్గుపాటి విజ్ఞప్తి
- నేడు డాకు మహారాజ్ ప్రీ రిలీజ్ ఈవెంట్
- హాజరుకానున్న మంత్రి నారా లోకేశ్



ఎస్పీతో ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి తదితరులు

అనంతపురం అర్బన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో స్వీయ నియంత్రణ, క్రమశిక్షణగా ఉండాలని అభిమానులు, కార్యకర్తలకు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. శ్రీనగర్ కాలనీలోని అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో జిల్లా ఎస్పీ జగదీష్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, బాలకృష్ణ అభిమానుల సంఘం జిల్లా అధ్యక్షుడు గౌస్‌మొద్దీన్, ఎన్‌బీకే హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు జగన్‌తో కలిసి బుధవారం ఆయన ఏర్పాట్లను పర్యవేక్షించారు. వీఐపీలు, ప్రజాప్రతినిధుల గ్యాలరీలు, అభిమా నుల కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా ఎస్పీ జగదీష్‌తో ఏర్పా ట్లు, భద్రతా చర్యలపై ఆరా తీశారు. తమ అభిమాన హీరో బాలకృష్ణ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ తన నియోజకవర్గంలో జరగడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి లోకేశ్ హాజరవుతారని తెలిపారు.

పటిష్ట బందోబస్తు

అనంతపురం క్రైం: నగరంలోని శ్రీనగర్‌కాలనీలో నిర్వహిస్తున్న డాకు మహారాజ్ ఈవెంట్‌కి సంబంధించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ జగదీష్ తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమానికి 25వేల మంది వస్తారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. పాసులున్న వారు మాత్రమే ప్రాంగణంలోకి రావాలని సూచించారు. డాకూ మహారాజ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ కార్యక్రమం నిర్వహణకు సమయం దగ్గర పడుతున్నా వేదిక, ఇతర ఏర్పాట్ల విషయంలో ఇంకా చాలా పని పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు 18 నుంచి 20 ఐచర్లకు సంబంధించి బారికేడ్లు తరలించాల్సి ఉందని పోలీస్‌వర్గాలు చెబుతున్నాయి. కానీ ఇప్పటి వరకు 8 నుంచి 10 వాహనాల బారికేడ్లనే తెప్పించినట్లు తెలుస్తోంది. వేదిక కాకుండా సెలబ్రెటీ గ్యాలరీ 300మందికి ఏర్పాటు చేయాల్సి ఉంది. మోస్ట్ ఇంపార్టెంట్ పర్సన్(ఎంఐపీ) విభాగంలో 4వేల మందికి ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. ఇక జనరల్ గ్యాలరీ (అన్‌లిమిటెడ్)పేరుతో కుర్చీలు లేకుండా మరో విభాగం ఏర్పాటు చేయాల్సి ఉంది. వీటికి ప్రత్యేకంగా బారికేడ్లు తప్పనిసరి. లేకపోతే పరిస్థితి ఆందోళనకరంగా ఉండే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు.

నేడు జిల్లాకు మంత్రి నారా లోకేశ్ రాక



అనంతపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ గురువారం జిల్లాకు రానున్నారు. రాష్ట్ర మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత నారాలోకేశ్ జిల్లాకు తొలి సారిగా వస్తున్న నేపథ్యంలో ఆ పార్టీ నాయకత్వం భారీగా స్వాగత ఏర్పాట్లు చేస్తోంది. ఇదిలా ఉండగా.. హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ఆయన హాజరవుతున్నారు. మధ్యాహ్నం 3.20 గంటలకు విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో బయలుదేరి సాయంత్రం 4.15 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి నారాలోకేశ్ చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి సాయంత్రం 6 గంటలకు అనంతపురం నగర శివారులోని శ్రీనగర్ కాలనీ సమీపంలో ముత్యాలరెడ్డి కంపౌండ్‌లో ఏర్పాటు చేసిన డాకు మహారాజ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ వేదికకు చేరుకుంటారు. ఆ కార్యక్రమం అనంతరం రాత్రి 9 గంటలకు అనంతపురం నుంచి కర్నూలుకు బయలుదేరి వెళతారు. ఈ నేపథ్యంలో నారా లోకేశ్ పర్యటన, ప్రీరిలీజ్ ఈవెంట్ విజయవంతం చేయడానికి జిల్లా నాయకులు శ్రమిస్తున్నారు.

ప్రైవేటుకు దీటుగా అహుడా ఎంఐజీ లే అవుట్‌లు

- అహుడా చైర్మన్ టీసీ వరుణ్

అనంతపురం క్రైం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు వెంచర్లకు దీటుగా అహుడా పరిధిలో ఎన్టీఆర్ టౌన్‌షిప్ పేరుతో ఎంఐజీ లేఅవుట్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు అహుడా చైర్మన్ టీసీ వరుణ్ అన్నారు. అహుడా కార్యాలయంలో బుధవారం ఆయన అహుడా వైస్ చైర్మన్ శివ్‌నారాయణ శర్మ, అధికారులతో కలిసి కూడేరు, గుత్తి, మడకశిర ప్రాంతాల్లో వేసిన ఎంఐజీ లేఅవుట్ల బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వరుణ్ మాట్లాడుతూ ఎంఐజీ లేఅవుట్లను అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. లేఅవుట్లలో 40 అడుగుల సీసీ రోడ్లు, డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్, ఇఎల్ఎస్ఆర్‌తో నీటి సరఫరా, సీవెజ్ ట్రీట్మెంట్ ప్లాంట్(ఎస్‌టీపీ)తో భూగర్భ మురుగు కాలువ పైపులైన్లు, కరెంటు సదుపాయాలు, వర్షపు నీటి కాలువ, వీధి దీపాలు, పార్కులు వంటి అభివృద్ధి పనులతో వసతులుంటాయన్నారు. వైస్ చైర్మన్ శివ్ నారాయణ శర్మ మాట్లాడుతూ నిర్ణీత గడువులోపు మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఇప్పటికే ఆ దిశగా కాంట్రాక్టర్లకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ మూడు లేఅవుట్లను ఏడాదిలోపు అభివృద్ధి చేస్తామన్నారు. ఈ లేఅవుట్లలో ప్లాట్లు కొన్నవారు ఎవరైనా డబ్బు మొత్తం ఒకేసారి చెల్లిస్తే 5శాతం డిస్కౌంట్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, సెక్రటరీ గౌరీశంకర్‌రావు, ఈఈ దుష్యంత్, జేపీఓ హరీష్ చౌదరి, ఈఈ రేవంత్‌రెడ్డి, సర్వేయర్ శరత్‌బాబు, ఇద్దరు ప్లానింగ్ సెక్రటరీలు ప్రమీల, నాగశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఫైనల్లో బెంగళూరు-నర్మదావ్యాలీ

మూడో స్థానం కోసం ఏఎస్‌ఏ పోటీ



గుజరాత్, నర్మదావ్యాలీ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్పైర్ బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో బెంగళూరు, నర్మదావ్యాలీ జట్లు ఫైనల్‌కు చేరాయి. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఆర్డీటీ, లాలిగా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 4వ ఇన్‌స్పైర్ అండర్-17 జాతీయ స్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీలు బుధవారం నాలుగోరోజు కొనసాగాయి. నర్మదావ్యాలీ మధ్యప్రదేశ్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ గుజరాత్ జట్ల మధ్య జరిగిన పోరు డ్రాగా ముగిసింది.

ఫాల్కన్ గర్ల్స్ ఒడిశాపై కంపాసిన్ 3గోల్స్, లైఫ్ స్పోర్ట్స్ అకాడమీపై పెన్నా ఏపీ 8గోల్స్, స్పోర్ట్స్ ప్లస్ అకాడమీ చెన్నైపై బెంగళూరు 2గోల్స్, థామ్ తమిళనాడుపై అనంతపూర్ స్పోర్ట్స్ అకాడమీ జట్టు 3గోల్స్, నందిఫౌండేషన్ గుజరాత్‌పై లిబర్టీ లేడీస్ తమిళనాడు జట్టు 6గోల్స్ తేడాతో విజయం సాధించాయి. పాయింట్ల పట్టిక ఆధారంగా 15పాయింట్లతో ఉన్న బెంగళూరు, 13పాయింట్లతో ఉన్న నర్మదావ్యాలీ మధ్యప్రదేశ్ జట్లు గురువారం నిర్వహించే ఫైనల్ పోరులో తలపడనున్నాయి. తరువాత స్థానంలో ఉన్న అనంతపూర్ స్పోర్ట్స్ అకాడమీ 10పాయింట్లు, స్పోర్ట్స్ ప్లస్ అకాడమీ చెన్నై మధ్య తృతీయ స్థానం కోసం జరిగే పోరులో తలపడనున్నాయి.

సమస్యలకు పరిష్కారం చూపని సదస్సులు

- ముగిసిన రెవెన్యూ సదస్సులు
- ఫిర్యాదులు 6,524... పరిష్కారం 1,684
- ఆశించిన స్థాయిలో కనిపించని ఫలితం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టరు వినోద్‌కుమార్(ఫైల్)

అనంతపురం టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయడం కోసం టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెవెన్యే సదస్సులకు ఫిర్యాదులు వేలల్లో వచ్చాయి. దాదాపు 33 రోజుల పాటు నిర్వహించిన సదస్సుల్లో బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో సాధ్యమైనవాటికి అక్కడే పరిష్కారం చూపారు. అయితే ఆశించిన స్థాయిలో కాదు. సదస్సులు ముగిసినా వేల సంఖ్యలో సమస్యలు పెండింగ్‌లో ఉండిపోయాయి.

6,524 ఫిర్యాదులు... 1,684 పరిష్కారం

అధికారుల లెక్కల ప్రకారం డిసెంబరు 6 నుంచి జిల్లాలో రెవెన్యూ సదస్సులు మొదలు పెట్టారు. మొత్తం 503 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. ఇవి బుధవారంతో ముగిశాయి. అధికారులు రికార్డుల ప్రకారం మొత్తం 6,524 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో అనంతపురం డివిజన్‌లో 2,510, గుంతకలు డివిజన్‌లో 2,577, కళ్యాణదుర్గం డివిజన్‌లో 1,437 ఫిర్యాదులు అందాయి. అత్యధికంగా ఆర్ఆర్ఆర్, సరిహద్దులు, రీసర్వేలో తప్పులు, ఆన్‌లైన్‌లో భూరికార్డులు అక్రమంగా మార్పులు, భూఆక్రమణలు తదితర వాటిపై ఫిర్యాదులు వచ్చాయని అధికారులు పేర్కొన్నారు. తమ భూ సమస్యలన్నీ ఈ సదస్సుల ద్వారా పరిష్కారం అవుతాయని ఆశించిన బాధితులకు నిరాశే మిగిలిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. వచ్చిన ఫిర్యాదులలో 1,684 మాత్రమే పరిష్కరించి నట్లు అధికారులు పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులు ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకోగా భూసమస్యలున్న రైతులు మాత్రం నిట్టూరుస్తున్నారు. మొత్తంమీద రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రభుత్వం ఆశించిన స్థాయిలో సమస్యలు పరిష్కారం కాలేదు.

న్యూస్ బాక్స్

ఇద్దరికి ఏడాది జైలు

మడకశిర టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఇద్దరు ముద్దాయిలకు ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ మడకశిర జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి ఆర్.అశోక్‌కుమార్ బుధవారం తీర్పు ప్రకటించారు. మడకశిర మండల పరిధిలోని కల్లుమర్రి గ్రామంలో 2022 సంవత్సరంలో వినాయక నిమజ్జన ఊరేగింపులో పోలీసు విధులకు ఆటంకం కల్గించిన కేసులో ఈ శిక్ష విధించినట్లు కోర్టు కానిస్టేబుల్ బాలకృష్ణ తెలిపారు. కల్లుమర్రి గ్రామానికి చెందిన ఎన్.శివప్ప, పరిగి మండలం నరసాపురం గ్రామానికి చెందిన ప్రవీణ్ అనే ఇద్దరు వ్యక్తులు 2022 సంవత్సరంలో కల్లుమర్రి గ్రామంలో వినాయక నిమజ్జనం ఊరేగింపులో పోలీసు విధులకు ఆటంకం కల్గించారు. దీనిపై కానిస్టేబుల్ ఎస్ఎన్ సుధాకర్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ నాగేంద్ర కేసు దర్యాప్తు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు తెలిపారు. వాదనలు విన్న న్యాయాధికారి తీర్పు వెలువరించారు.

కోడిపందేలు, పేకాటపై కఠిన చర్యలు : ఎస్పీ

అనంతపురం క్రైం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడైనా కోడిపందేలు, పేకాట ఆడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ జగదీష్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి పండుగ రోజుల్లో సాంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కోడి పందేలు, పేకాట నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జూద క్రీడలు కాకుండా సాంప్రదాయ ఆటలు ఆడుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమన్నారు. కోడి పందేల జూదరులు, కత్తుల తయారీదారులు, పేకాట నిర్వాహకులపై ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. కోడి పందేలు నిర్వహించినా, నిర్వహణకు స్థలాలు, భూములు ఇచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా కోడిపందేలు, జూదంపై సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు లేదా డయల్ 100/112కు ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

టమోటా కిలో రూ.12

అనంతపురం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 12తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయని పేర్కొన్నారు. కిలో సరాసరి ధర రూ. 10, కనిష్ఠ ధర రూ. 7 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.23 వేలు

అనంతపురం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 23,190 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 5వేలు, సరాసరి రూ. 14వేలతో అమ్ముడు పోయినట్లు పేర్కొన్నారు. మార్కెట్‌కు మొత్తం 27 టన్నుల చీనీకాయలు వచ్చాయని వివరించారు.

శతాధిక వృద్ధురాలి మృతి


వెంకటలక్ష్మమ్మ (ఫైల్)

ఉరవకొండ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని షేక్షానుపల్లికి చెందిన ముత్తలూరు వెంకట లక్ష్మమ్మ అనే 104 సంవత్సరాల శతాధిక వృద్ధురాలు మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆమెకు 9 మంది సంతానం. ఆమె భర్త 1986లో మృతి చెందాడు. 104 సంవత్సరాలు వయస్సులోనూ ఆమె స్వతహాగా తన పనులు తాను చేసుకొనేది. ఎన్నడూ ఆసుపత్రికి కూడా వెళ్లలేదని బంధువులు తెలిపారు. ఆమె మృతికి టీడీపీ మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్ సంతాపం తెలిపారు.

684 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 684 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 442 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

గుంతకల్లు టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వైటీ చెరువు గ్రామానికి చెందిన కమ్మర ఉసేన్‌పీరా (74) అనే వృద్ధుడు వారం క్రితం అదృశ్యం కా గా.. బుధవారం చెరువులో మృతదేహం లభ్యమైంది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వైటీ చెరువు గ్రామ సమీపంలో ఉసేన్‌పీరాకు 2.90 ఎకరాల భూమి ఉంది. అందులో మొక్కజొన్న సాగు చేశారు. ఈనెల 2న ఉసేన్‌పీరా పొలం వద్దకు అని చెప్పి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో వెతికారు. బుధవారం చెరువులో శవమై తేలాడు. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

రూ.100 కోట్ల ప్రాజెక్టులో భాగస్వామ్యం

- విద్యార్థులకు ఉచితంగా ఇంటర్న్‌షిప్
- జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు


మాట్లాడుతున్న వీసీ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ హైదరాబాద్ హబ్ స్పోక్ ఇన్‌స్టిట్యూట్‌తో రూ.100 కోట్ల ప్రాజెక్టులో జేఎన్‌టీయూ భాగస్వామం అయిందని ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సుదర్శనరావు పేర్కొన్నారు. బుధవారం జేఎన్‌టీయూ డెస్క్‌టాప్ ప్లానర్, క్యాలెండర్, టెలిఫోన్ బుక్ ఆవిష్కరణ వేడుక నిర్వహించారు. డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ ప్లానింగ్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన వేడుకకు వీసీ ప్రొఫెసర్ సుధ్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య, ఓఎస్డీ ప్రొఫెసర్ దేవన్న ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కొత్త ఏడాది ప్రారంభంలోనే రెండు ముఖ్యమైన ఒప్పందాలను కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఒకటి రూ.100 కోట్ల ప్రాజెక్ట్ కాగా మరొకటి విద్యార్థులకు ఉచితంగా ఇంటర్న్‌షిప్ ఇవ్వడానికి ఐఐటీ గౌహతి, ఐబీఎం, వాగ్దావి గ్రూప్, గవర్నమెంట్ టెక్నాలజీస్‌తో జేఐఎఫ్‌టీ ప్రోగ్రామ్ ఎంఓయూ చేసుకున్నామని తెలిపారు. అధ్యాపక, ఉద్యోగ, సిబ్బంది అందరూ ఎవరి పనిని వారు సక్రమంగా చేసుకుంటూ వెళ్తే లక్ష్యాన్ని సులువుగా అధిరోహిస్తామని తెలిపారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌కు అవసరమైన ప్రక్రియలు మొత్తం నిర్వీర్యం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో గత సంవత్సరం సరైన ర్యాంకింగ్ దక్కలేదన్నారు. ఈ లోటును భర్తీచేసి మెరుగైన ర్యాంక్‌ను సాధించేందుకు రిజిస్ట్రార్, డైరెక్టర్లతో కలిసి శ్రమిస్తున్నామని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా తరగతులు బోధించడం, ల్యాబ్‌లకు హాజరు కావడంతోపాటు పబ్లికేషన్స్, పేటెంట్స్, ప్రాజెక్ట్స్‌పై దృష్టిసారించాలని సూచించారు. వర్సిటీ ఆర్థిక భారం రాష్ట్ర ప్రభుత్వంపై లేకుండా ఉండాలంటే 'మన యూనివర్సిటీని స్వయం సుస్థిరమైనదిగా చేయడం ఎలా' అనే ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ అంశంపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో చర్చించి అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ క్రిష్ణయ్య మాట్లాడుతూ.. వర్సిటీ పరిధిలోని కళాశాలలు డీమ్డ్ వర్సిటీలు మారిపోతున్నాయన్నారు. ఈ పోటీని తట్టుకోవాలంటే మనం బాగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కొంతమంది తరగతులకు డుమ్మాకొట్టడం, పనిచేయకుండా తప్పించుకోవడానికి అలవాటు పడ్డారన్నారు. అనంతరం డెస్క్‌టాప్ ప్లానర్, క్యాలెండర్, టెలిఫోన్ బుక్ ఆవిష్కరించారు.

డిగ్రీ విద్యార్థి అదృశ్యం

అనంతపురం క్రైం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): క్రికెట్‌పై మోజుతో ఓ డిగ్రీ విద్యార్థి అదృశ్యమయ్యాడు. నగరంలోని నిర్మలానందనగర్‌కు చెందిన లక్ష్మయ్య కుమారుడు విష్ణువర్ధన్ స్థానిక ఎస్ఎస్‌బీఎన్‌లో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇతడికి క్రికెట్ అంటే చాలా ఇష్టం. గతంలో విజయవాడకు వెళ్లి రెండు రోజులు ఉండి వచ్చాడు. ఈనెల 1వతేదీ ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. కొడుకు గురించి ఆరా తీసి ఆచూకీ లభించకపోవడంతో బుధవారం తండ్రి లక్ష్మయ్య త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ట్రాక్టర్ కిందపడి యువకుడి మృతి


మృతి చెందిన వెంకటచరణ్‌రెడ్డి

పెద్దపప్పూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చుకోట అటవీప్రాంతంలో బుధవారం తెల్లవారుజామున ట్రాక్టర్ కిందపడి వెంకటచరణ్‌రెడ్డి (25) అనే యువకుడు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన లక్ష్మీరెడ్డి ఆయన కుమారుడు వెంకటచరణ్‌రెడ్డి ట్రాక్టర్‌లో బండల లోడుతో ధర్మవరం వెళుతున్నారు. ముచ్చుకోట అటవీ ప్రాంతం రాగానే స్పీడ్ బ్రేకర్ రావడంతో ట్రాక్టర్‌ను నడుపుతున్న లక్ష్మీరెడ్డి బ్రేక్ వేయడంతో ముందు భాగంలో కూర్చొన్న కుమారుడు వెంకటచరణ్‌రెడ్డి కిందపడిపోయాడు. ఈ సమయంలో ట్రాక్టర్ అతడిపై వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్యతోపాటు కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మోదీకి బ్రహ్మరథం


రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం


విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం


బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.

భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనం పైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.


వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్


బహిరంగ సభకు హాజరైన అశేష జనం

అభివృద్ధికి సహకరించండి

- తీర్మానాలు ఇవ్వకుండా అడ్డుపడకండి
- జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఇతర సభ్యులు
- రైతుల్లో చైతన్యం నింపండి : పుట్టపర్తి ఎమ్మెల్యే


మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర

అనంతపురం విద్య, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండల, గ్రామ స్థాయిలో అధికారులు తీర్మానాలు ఇవ్వకుండా అడ్డుపటం సరి కాదని, జిల్లాలో జడ్పీటీసీలతో కలసి అభివృద్ధికి సహకరించాలని జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కోరారు. బుధవారం జడ్పీలో స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ప్రధాన సమావేశ మందిరంలో ఆర్థిక, ప్రణాళిక, వర్క్స్ గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం స్టాండింగ్ కమిటీ సమావేశాలు, అదనపు సమావేశ మందిరంలో మహిళా సంక్షేమం, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. తొలిసారి స్టాండింగ్ కమిటీ సమావేశానికి అసిస్టెంట్ కలెక్టర్ వినూతన్న, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర హాజరయ్యారు. జడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మొదట డీపీఓ, పంచాయతీ రాజ్, డ్వామా తదితర అంశాలపై చర్చ ప్రారంభించారు. పలువులు జడ్పీటీసీ సభ్యులు పెండింగ్ పనులను లేవనెత్తారు. జడ్పీటీసీ సభ్యులు భూతరాజు, శ్రీనివాసులు మాట్లాడుతూ... తాము తెచ్చిన పనులకు మండల, గ్రామ స్థాయిలో పంచాయతీ తీర్మానాలు ఇవ్వకుండా అడ్డుపడుతున్నారని అన్నారు. దీనిపై జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ.. పదే పదే ఈ సమస్యను సభ్యులు సభ దృష్టికి తీసుకొసున్నారని, పరిష్కరించాలని సీఈఓను ఆదేశించారు. దీనికి సీఈఓ రామచంద్రారెడ్డి స్పందిస్తూ.... సత్యసాయి, అనంతపురం డీఈఓలు, అన్ని మండలాల ఎంపీడీఓలతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బుక్కరాయసముద్రం, కంబదూరు, కనగానపల్లి, విడపనకల్లు జడ్పీటీసీలు మాట్లాడుతూ...గతంలో ఇచ్చిన పనులు సిమెంట్, ఇసుక కొరత ఇతర కారణాల వల్ల ఆగిపోయాని, వాటిని రద్దు చేశారా..? లేక కొత్తగా మంజూరు చేస్తారా అని పంచాయతీ రాజ్ ఎస్ఈని అడిగారు. ఉపాధి హామీ పనులను జడ్పీటీసీలకు కేటాయించాలని కోరారు. జడ్పీ చైర్‌పర్సన్ కలుగజేసుకుని గతంలోనే పెండింగ్ లిస్టు అడిగామని, ఎందుకు ఇవ్వలేదంటూ...ఎస్ఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోవాలంటూ హెచ్చరించారు. జడ్పీ అదనపు సమావేశ మందిరంలో వ్యవసాయం స్టాండింగ్ కమిటీలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరు మాట్లాడారు. రైతులకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందించే వ్యవసాయ పరికరాలు, డ్రిప్పు, స్రింక్లర్లు, విత్తనాలు, ఎరువులపై అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారని అన్నారు. గత ఐదేళ్లలో రైతులకు ఎలాంటి పరికరాలు అందించలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పుట్టపర్తి నియోజకవర్గంలో 3500 మంది రైతులకు డ్రిప్పు, స్రింక్లర్లు అందించామని గుర్తుచేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే సీఎం చంద్రబాబు ఆశయమని తెలిపారు. అనంతరం వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, జడ్పీటీసీ సభ్యుడు చంద్ర హాస్టళ్లలోని సమస్యలపై అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మూడు ఇళ్లలో చోరీ

తాడిపత్రి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టైలర్స్‌కాలనీ, టీచర్స్‌కాలనీల్లో బుధవారం తెల్లవారుజామున మూడిళ్లల్లో చోరీలు జరిగాయి. టైలర్స్‌కాలనీలో నివాసం ఉంటున్న చాంద్‌బీ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దొంగలు చొరబడి రూ.15వేలు నగదుతోపాటు జత కమ్మలు చోరీ చేసినట్లు తెలిపారు. ఇదే కాలనీకి చెందిన అల్లాబకాష్ ఇంట్లో చోరీ జరిగినట్లు పేర్కొన్నారు. టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న నాగరాజురావు పది రోజులుగా బెంగళూరులో ఉన్నారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తాళాలు పగలగొట్టి చోరీకి ప్రయత్నించారు. కానీ ఇంట్లో నగదు, బంగారు లేకపోవడంతో వెనుదిరిగారు. అదేకాలనీలో ఉన్న వరప్రసాద్ ఇంటి వద్ద నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లారు. ఈ బైక్‌ను ఆటోనగర్ సమీపంలో విడిచిపెట్టారు. పోలీసులు చోరీ జరిగిన ఇళ్లను క్లూస్‌టీం ద్వారా పరిశీలించారు. ద్విచక్రవాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

చెట్టుపై నుంచి పడి కూలీ మృతి

బ్రహ్మసముద్రం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అజ్జయ్యదొడ్డి గ్రామానికి చెందిన పూజారి చిన్న రాజన్న (44) గత ఐదేళ్లుగా కూలీ పని చేసుకుంటూ బెంగళూరు జీవనం సాగించేవాడు. బుధవారం పనికి వెళ్లి చెట్టు నరుకుతుండగా కాలుజారి కిందపడ్డాడు. చెవి, ముక్కులో రక్తం ప్రవహించగా హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించాడని వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఇంటర్ పరీక్షలు యథాతథం: ఆర్ఐఓ

అనంతపురం విద్య, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఇంటర్మీడియట్ మొదటి ఏడాది పరీక్షలు యథాతథంగా జరుగుతాయని ఆర్ఐఓ వెంకటరమణ నాయక్ తెలిపారు. ఇంటర్ మొదటి ఏడాది పరీక్షలు ఉండవన్న ప్రచారం నేపథ్యంలో బుధవారం ఆర్ఐఓను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. దీనిపై ఆయన మాట్లాడుతూ ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఉండవంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతోందన్నారు. ఇది వాస్తవం కాదన్నారు. ఈ విద్యా సంవత్సరం ఇచ్చిన షెడ్యూల్ మేరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 2025-26 విద్యా ఏడాది నుంచి ఇంటర్ మొదటి ఏడాది పరీక్షల నిర్వహణపై బోర్డు ప్రజల అభిప్రాయం తీసుకుంటోందన్నారు. ఇంటర్ బోర్డు పోర్టల్ bie.ap.gov.inలో ప్రజల అభిప్రాయాలు చూడవచ్చున్నారు. ఈ జనవరి 26 నుంచి ఎవరైనా తమ అభిప్రాయాలు, సూచనలను biereforms@gmail.com అనే మెయిల్‌కు పంపవచ్చునన్నారు. అయితే దీనికి, ఈ ఏడాది ఫస్ట్ ఇయర్ పరీక్షలకు ఎలాంటి సంబంధం లేదని, ఇచ్చిన షెడ్యూల్ మేరకు ఈ ఏడాది పరీక్షలుంటాయన్నారు. విద్యార్థులు ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా పరీక్షలకు సిద్ధం కావాలని ఆర్ఐఓ సూచించారు.

సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు ఇద్దరి ఎంపిక

అనంతపురం విద్య, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు, మరో టీచర్ రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో సత్తా చాటారు. సౌత్ ఇండియా స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికయ్యారు. విజయవాడలో మంగళవారం జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో జిల్లా విద్యార్థి, టీచర్ ప్రతిభ చూపారు. విద్యార్థి గ్రూప్ విభాగం కణేకల్లు మండలం హనకనహాళ్ జడ్పీహైస్కూల్ 9వ తరగతి విద్యార్థులు మహాలక్ష్మి, గీతారెడ్డి 'వృద్ధులకు పలు ప్రయోజనాలందించే ఊత కర్ర' ప్రాజెక్టు ప్రదర్శించారు. టీచర్స్ విభాగంలో ఉరవకొండ మండలం ఆమిద్యాల జడ్పీహైస్కూల్ ఫిజిక్స్ టీచర్ బండి శ్రీనివాసులు 'సరళమైన పద్ధతిలో ఒకే ప్రయోగం ద్వారా మూడు న్యూటన్ గమన సూత్రాలు' వివరిస్తూ...రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపికయ్యాయి. ఈ రెండు ప్రాజెక్టులు సౌత్‌ఇండియా స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికయ్యాయి. దీంతో సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ వెంకట క్రిష్ణారెడ్డి నుంచి ఆ విద్యార్థులు, టీచర్ రాష్ట్రస్థాయి అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. జిల్లా నుంచి రాష్ట్రస్థాయిలో సత్తా చాటి...సౌత్ ఇండియా స్థాయికి ఎంపిక కావడంతో వారిని డీఈఓ ప్రసాద్‌బాబు, జిల్లా సైన్స్ ఆఫీసర్ బాలమురళీ కృష్ణ ప్రత్యేకంగా అభినందించారు.


హనకనహాళ్ విద్యార్థులు, టీచర్‌ను అభినందిస్తున్న ఎస్పీడీ శ్రీనివాసరావు

సీనియారిటీ జాబితా విడుదల

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పనిచేస్తున్న 22 మంది వర్కింగ్ మున్సిపల్ కమిషనర్ స్పెషల్ గ్రేడ్‌లకు, 49 మంది వర్కింగ్ మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-1 కేడర్‌కు సంబంధించి ప్రభుత్వం సీనియారిటీ జాబితా ప్రకటించింది. అలాగే, 13 మంది గ్రేడ్-2 కేడర్‌కు, 26 మంది గ్రేడ్-3 కేడర్‌కు సీనియారిటీ జాబితా ప్రకటిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు విడుదల చేసింది.

వైద్యశాఖలో ఖాళీల భర్తీకి దరఖాస్తులు

అనంతపురం టౌన్, జనవరి8(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య శాఖ పరిధిలో ఖాళీగా ఉన్న ఎఫ్ఎన్ఓ, వాచ్‌మెన్ పోస్టులను ఔట్‌సోర్సింగ్‌లో భర్తీ చేస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి బుధవారం వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 18 ఎఫ్ఎన్ఓ పోస్టులు, 11వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటి భర్తీకి గురువారం నుంచి ఈనెల 20 వరకు దరఖాస్తులు స్వీకరింస్తామన్నారు. జిల్లా కార్యాలయం పనిదినాలలో ఉదయం 10-30గంటలనుంచి సాయంత్రం 5గంటలవరకు దరఖాస్తులను తీసుకుంటామన్నారు. ఈ పోస్టులకు సంబంధించిన వివరాలను జిల్లా వైద్యశాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు వెల్లడించారు. ఆ వెబ్‌సైట్‌లోనే దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకొని భర్తీచేసిన తర్వాత సర్టిఫికెట్లు జతపరచి అందజేయాలన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

అనంతపురం క్రైం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తమపై దాడి చేశారని న గరంలోని కమలానగర్‌కు చెందిన ధర్మరామ్ అనే వ్యక్తి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కమలానగర్‌లోని తమ మామ గోపాల్‌కు చెందిన ఎలక్ట్రిక్ షాపునకు ఈనెల 6వతేదీ బాబా అనే వ్యక్తి వచ్చి హెల్మెట్ కోసం గొడవపడ్డాడని ఫిర్యాదు చేశారు. అనంతరం 7వతేదీ బాబా, ఇ ర్ఫాన్, రఫీ కలిసి వచ్చి మరోసారి గొడవ పెట్టుకుని తనపై, తన తమ్ముడు దీపక్‌పై దాడి చేశారని, తన మామ గోపాల్ అ డ్డుకున్నాడని ఫిర్యాదు చేశారు. ఈ ఘ టనపై వన్‌టౌన్ పోలీసులు కోర్టు ఆదేశా లు వచ్చిన తరువాతే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

న్యూస్ బాక్స్

కరువు జాబితాలో చేర్చండి



కరువు బృందానికి వినతి పత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

బత్తలపల్లి జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలాన్ని కరువు ప్రాంతాల జాబితాలో చేర్చాలని కేంద్ర కరువు బృందానికి టీడీపీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. తాడిమర్రి మండలంలో బుధవారం కేంద్ర కరువు బృందం పర్యటించింది. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు నెట్టెం రమణ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు వెళ్లి.. కేంద్రబృందాన్ని కలిశారు. మండలంలో నెలకొన్న కరువు పరిస్థితులను వివరించారు. వర్షాలు సక్రమంగా రాక రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేశారని, ఆ పంటలూ చేతికి అందక తీవ్రంగా నష్టపోయారని అన్నారు. కావున బత్తలపల్లి మండలాన్ని కరువు మండలాల జాబితాలో చేర్చి రైతులను ఆదుకోవాలని కోరారు.

రైతులకు రుణాలిచ్చి ఆదుకోండి



మాట్లాడుతున్న గోనుగుంట్ల భూషణ్

తాడిమర్రి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రైతులందరికి బ్యాంకుల ద్వారా విరివిగా రుణాలు అందించి, ఆదుకోవాలని ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్ కోరారు. బుధవారం మండలంలో పర్యటించిన కేంద్ర కరువు బృందంతో ఏర్పాటు చేసిన రైతులతో ముఖాముఖీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులకు సంబంధించి ప్రస్తుతం రుణాలన్నింటిని ఎలాంటి ష్యూరిటీ లేకుండా మార్టిగేజ్ చేసి తక్కువ వడ్డీకి రుణాలు అందించాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అను సంధానం చేయాలని, తద్వారా సాగుకు అయ్యే ఖర్చు తగ్గి రైతు ఆర్థికంగా నిలదొక్కుకుంటారని అన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా శెట్టిపి



శెట్టిపి జయచంద్రారెడ్డి

ధర్మవరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శిగా ధర్మవరం పట్టణానికి చెందిన శెట్టిపి జయచంద్రారెడ్డి ఎంపికయ్యారు. కాకినాడలోని పీఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన 17వ రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకత్వం అతన్ని ఏకగ్రీవంగా ఎంపికచేసింది. ఈయన యూటీఎఫ్ కార్యకర్త స్థాయి నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యదర్శిగా, కోశాధి కారిగా, గౌరవాధ్యక్షుడిగా, అధ్యక్షుడిగా అనంతపురం జిల్లా ప్యాప్టో చైర్మన్‌గా పని చేశారు. ప్రస్తుతం సత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఆయన ఎంపిక పట్ల ధర్మవరం యూటీఎఫ్ జోన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

బీజేపీ పట్టణాధ్యక్షుడికి సన్మానం

ధర్మవరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ నూతన పట్టణ అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్‌ను పద్మశాలీయ కుల బాంధవులు బుధవారం ఘనంగా సన్మానించారు. స్థానిక మార్కెండేయ స్వామి ఆలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పద్మశాలీయ సంఘం పట్టణ అధ్యక్షుడు పుత్తారుద్రయ్య, ఉపాధ్యక్షుడు జింకా నాగభూషణం, పద్మశాలీయ కులబాంధవులు వద్దిశివ, ఊట్లనరేంద్ర, భాస్కర్ పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో మార్పులు జరగాలి

కదిరి అర్బన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ హాస్టల్లో నిర్వాహణ, పనితీరు సక్రమంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బీసీ ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సంపంగి గోవర్ధన్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. హాస్టల్లో విద్యార్థుల హాజరు పట్టికలో జరుగుతున్న అవకతవకలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ అవసరమన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మార్పులు చేసిన విధంగా బయోమెట్రిక్ సక్రమంగా అమలు అయ్యేలా అధికారులు చొరవ చూపాలన్నారు. బీసీ సంక్షేమ శాఖలో ప్రణాళిక బద్ధమైన పనితీరును కనబరచి. విద్యార్థుల సంక్షేమ కోసం బీసీ వెల్ఫేర్ వ్యవస్థను ప్రక్షాళన చేయాలన్నారు.

తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలి



పాఠశాల నిరసన వ్యక్తం చేస్తున్న పీఎస్‌యూ నాయకులు

ధర్మవరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకాన్ని ఈ సంవత్సరం నుంచే అమలు చేయాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక బీఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులతో కలిసి బుధవారం నిరసన చేపట్టిన వారు మాట్లాడారు. పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నరేంద్ర మాట్లాడుతూ... తాము అధికారంలోకి రాగానే తల్లికి వందనం ఇస్తామని హామీ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీ ఇచ్చారని, నేడు అధికారంలోకి వచ్చాక వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఆ పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించడం తగదని అన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీఎంబర్స్‌మెంట్ కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఎస్‌యూ నాయకులు నందకిశోర్, భరత్, సురేశ్ పాల్గొన్నారు.

వ్యాపారిపై హత్యాయత్నం

హిందూపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): హిందూపురం మండలంలోని తూముకుంట చెరువుకట్ట వద్ద మంగళవారం అర్ధరాత్రి దాటాక పట్టణంలోని దండురోడ్డుకు చెందిన నారాయణరెడ్డి అనే వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. ఆయన ధర్మవరంలో చీరలు తీసుకుని వెళ్లి యలహంకలో పాలిష్ చేయించేవాడు. మంగళవారం బెంగళూరుకు వెళ్లి అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో పూలకుంట చెరువుకట్ట వద్దకు వచ్చారు. అయితే అక్కడకు కొంతమంది వచ్చారు. ఆయన తనకు సన్నిహితంగా ఉండే వ్యక్తికి ఫోన్ చేయగా ఆయనతోపాటు నలుగురు వచ్చి అతన్ని పక్కకు తీసుకెళ్లి అందరూ కలసి మద్యం సేవించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి గొంతును కత్తితో కోశారు. దీంతో తీవ్ర రక్తస్రావమైంది. అయితే హత్యాయత్నానికి పాల్పడినవారు అక్కడి నుంచి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన నారాయణరెడ్డి అటుగా వస్తున్న వేరే వాహనంలో ఆసుపత్రికి వెళ్లాడు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం బెంగళూరుకు తరలించారు. ఇదిలా ఉంటే నారాయణరెడ్డి కొంతకాలం క్రితం మరో వ్యక్తి వద్ద డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. ఈ సందర్భంగా ఇద్దరి ఆర్థికలావాదేవీలే హత్యాయత్నానికి కారణమని తెలుస్తోంది. ఇందులో ఐదుగురు పాల్గొన్నట్లు సమాచారం. ఇందులో హిందూపురానికి చెందిన ఇద్దరు, గోరంట్లకు చెందిన ముగ్గురు ఉన్నారని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. నిందితులను పట్టుకోవడానికి రెండు బృందాలను ఏర్పాటుచేశారు.



ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న పొట్టు లారీ



రాత్రివేళల్లో కట్టెలు వేసుకుని వెళ్తున్న లారీ

ఓవర్‌లోడ్ వాహనాలతో ప్రమాదాలు

పట్టించుకోని రవాణా అధికారులు, పోలీసులు

కొత్తచెరువు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం మీదుగా ప్రతి రోజు ఓవర్‌లోడ్‌తో కంకర, పొట్టు, కట్టెలు, మట్టి, బండరాళ్లతో లారీలు వెళ్తున్నాయి. పది రోజుల క్రితం ఓవర్ లోడ్‌తో కట్టెలు వేసుకుని పులివెందులకు లారీ వెళ్తుండగా కట్టెలు తగులుకొని 11 కేవీ విద్యుత్ వైర్లు తెగి కిందపడటంతో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో విద్యుత్ ట్రిప్ కావడంతో విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లైంది. లేకపోతే నిత్యం రద్దీగా ఉండే నేస్రూ సర్కిల్‌లో అనేక మంది మృత్యు వాత పడేవారు. ఇసుక, మట్టి, కంకర అధిక లోడ్‌తో లారీలు వెళ్తుండటంతో ఆ చిన్నచిన్న కంకర, మట్టి, ఇసుక గాలికి ఎగిరి.. వెనుక వచ్చే వాహనదారుల కళ్లలో పడతుండటంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. లారీకి కెపాసి టీకి మించి లోడ్ వేసుకుని వెళ్తున్నా.. పోలీసు లు, రెవెన్యూ శాఖ అధికారులు వారిపై చర్యలు తీసుకోకపోవడం పలు విమర్శలకు.. అనుమానాలకు తావిస్తోంది. ముఖ్యంగా మైనర్లు డ్రైవింగ్ లైసెన్స్‌లేని వారు కూడా ట్రాక్టర్‌లు, ఇతర వాహనాలను అధిక వేగంగా నడుపుతున్నారు.

రవాణాశాఖ అధికారులు కేవలం ఆటోలను మాత్రమే తనిఖీ చేస్తూ.. వారిపై కేసులు వేసి.. జరిమానాలు విధించడం తప్పా.. ఇలా అధిక లోడ్ వెళ్లే వాహనాల గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సత్యసాయి సేవలు అమోఘం

పారిశ్రామికవేత్త, శాస్త్రవేత్త డాక్టర్ ఆరకోయిస్వామి వేలుమణి

పుట్టపర్తిరూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మానవాళికి శ్రీసత్యసాయి బాబా అందించిన సేవలు అమోఘమని ప్రముఖ పారిశ్రామికవేత్త, శాస్త్రవేత్త థైరోకేర్ టెక్నాలజీస్ ఫౌండర్ డాక్టర్ ఆరకోయిస్వామి వేలుమణి కొనియాడారు. బుధవారం బెంగుళూరు నుంచి రోడ్డు మార్గాన ప్రశాంతి నిలయం చేరుకున్న ఆయన ప్రశాంతి నిలయంలో శ్రీసత్యసాయిమహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీసత్యసాయి సూపర్ హాస్పిటల్‌ను పరిశీలించారు. ఆ హాస్పిటల్‌లో నిరుపేదలకు అందిస్తున్న నాణ్యమైన వివిధ వైద్యసేవలను శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ ఆయనకు వివరించారు. అనంతరం ఆరకోయిస్వామి వేలుమణి మాట్లాడుతూ సత్యసాయి శివైక్యం తర్వాత కూడా బాబావారి అడుగుజాడల్లో సత్యసాయి సెంట్రల్ ట్రస్టు నిర్వహిస్తూ... నిరుపేదలకు అత్యంత ఖరీదైన వైద్యసేవలను పూర్తి ఉచితంగా అందిస్తుండటం హర్షణీయమన్నారు. ఆయన వెంట శ్రీసత్యసాయి సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ డైరక్టర్ డాక్టర్ గురుమూర్తి, జాయింట్ డైరక్టర్ అనిల్‌కుమార్ మెల్‌పూర్, శ్రీసత్యసాయిసేవా సంస్థల కో-ఆర్డినేటర్ కోటేశ్వరరావు, చీఫ్ ఇంజనీర్ హరనాథ్ ఉన్నారు.



వైద్యసేవలను ఆరకోయిస్వామి వేలుమణికి వివరిస్తున్న రత్నాకర్



ఉదయం 11 గంటలైనా కార్యాలయానికి రాని అధికారులు, సిబ్బంది

ఇష్టారాజ్యంగా విధులకు..

- సమయపాలన పాటించని ఇరిగేషన్ అధికారులు
- 11గంటలైనా విధులకు హాజరుకాని సిబ్బంది
- ఇబ్బందులు పడుతున్న రైతులు

ధర్మవరంరూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులకు వస్తున్నారు. ఎప్పుడు కార్యాలయానికి వెళ్లినా ఉద్యోగులు ఉండటం లేదు. బుధవారం ఆంధ్రజ్యోతి ఆ కార్యాలయాన్ని విజిట్ చేయగా.. 11 గంటలైనా ఆ కార్యాలయానికి అధికారులు రాలేదు. అధికారులతో పాటు కార్యాలయ సిబ్బంది సైతం అందుబాటులో లే రు. దీంతో కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. కొంతమంది సిబ్బంది వచ్చినా వారు కార్యాలయంలో ఉండకుండా చెట్లు కింద, మరికొంత మంది టీ, కాఫీలు తాగేందుకు గంటల కొద్ది బయట కేఫ్‌లలో కాలయాపన చేస్తున్నారు. ఇరిగేషన్ పనులు నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు అధికారులు అందుబాటులో లేకపోవడంతో గంటల తరబడి నిరీక్షించి.. నిరాశతో వెనుతిరుగుతున్నారు. అధికారులు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు పోతారో.. ఎవరికి తెలియడం లేదు. ఉన్న సిబ్బందిని అడిగితే ఫీల్డ్‌కు వెళ్లారని... కార్యాలయం పనుల మీద బయటకు వెళ్లారని చెబుతున్నారు.



భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ

ప్రభుత్వ భూముల పరిశీలన

నంబులపూలకుంట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరికొమ్మదిన్నె పరిధిలోని ప్రభుత్వ భూములను ఆర్డీఓ వీవీఎస్ శర్మ బుధవారం పరిశీలించారు. ప్రభుత్వం భూమి ఎంత ఉంది.. సాగు విస్తీర్ణం ఎంత.. పట్టా భూములు ఎన్ని.. అన్న వాటిని పరిశీలించారు. అలాగే అటవీ భూములను కూడా పరిశీలించారు. ఈ భూములు పరిశ్రమలకు అనుకూలంగా ఉంటాయా అని తహసీల్దార్ దేవేంద్రనాయక్‌తో చర్చించారు. వారి వెంట సర్వేయర్ జిలాన్, ఉపేంద్ర, వీఆర్‌ఓ రఘు ఉన్నారు.

ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించండి

ధర్మవరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక రంగా థియేటర్ వద్ద ప్రమాదకరకంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మన్‌ను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు ట్రాన్స్‌కో ఏఈ నాగభూషణాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ట్రాన్స్‌కో ఏఈని కలిసి ట్రాన్స్‌ఫార్మర్ వల్ల కలిగే ఇబ్బందులు వివరించారు. ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుకు ఆనుకుని ఉందని, అటు వైపు విద్యార్థులు వెళ్తుంటారని అన్నారు. నెల రోజుల క్రితం వృద్ధురాలు అటు వైపు వెళ్తూ ప్రమాదవ శాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు దగ్గరగా వెళ్లడంతో ఆమె విద్యుదాఘానికి గురైందన్నారు. దీంతో ఆ వృద్ధురాలికి కాలు తీసివేసే పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఏఈని కలిసిన వారిలో సీపీఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, పట్టణ సహాయ కార్యదర్శి రమణ, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పోలా లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సకలరాజా, నాయకులు బాలరంగయ్య, సురేశ్, ఆదినారాయణ, శ్రీనివాసులు, కేశవ, వీరనారప్ప పాల్గొన్నారు.



ట్రాన్స్‌కో ఏఈకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు



ప్రమాణ స్వీకారం చేస్తున్న సొసైటీ సభ్యులు

కార్యవర్గం ఎన్నిక

ధర్మవరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ టీచర్స్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపికచేశారు. స్థానిక కోటా స్కూల్‌లో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా లక్ష్మీనారాయణరెడ్డి వ్యవహరించారు. ఈ కార్యవర్గం 2030 వరకు కొనసాగుతుందని ఆయన తెలిపారు. సొసైటి అధ్యక్షుడిగా ధర్మవరానికి చెందిన సానే రవీంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడిగా రమేశ్‌బాబు, సెక్రటరీగా రామకృష్ణనాయక్, డైరెక్టర్లుగా అమానుల్లా, రాంప్రసాద్, అంజినాయక్, సాయిగణేశ్‌లను ఎంపిక చేసి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠ

ధర్మవరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాసనగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో అర్చకులు బుధవారం పలు హోమాలు.. పూజలు నిర్వహించారు. స్వామివారికి క్షీర జలాదివాసం, హోమాలు, ధాన్యదివాసం, గర్తపూజ, యంత్రస్థాపన తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

టీచర్లకు సర్టిఫికెట్లు మంజూరు చేయాలి

కదిరి అర్బన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఓపీఓలుగా విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని ఏపీటీఎఫ్(1938) కదిరి మండలాధ్యక్షుడు వరదారెడ్డి బుధవారం ప్రకటనలో కోరారు. ఈ విషయాన్ని నియోజకవర్గాల ఆర్వోల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లామని, అయినా వారు స్పందించలేదని అన్నారు. పీఓ, ఏపీఓలకు అప్పుడే డ్యూటీ సర్టిఫికెట్లు మంజూరు చేశారని, తమకు మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. ఈ మేరకు కలెక్టర్ టీఎస్ చేతన్‌కు వినతి పత్రం అందచేసినట్లు చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్యూటీ సర్టిఫికెట్లు జారీ చేయాలని కోరారు.

క్రైం న్యూస్ ..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



జయరాంనాయక్ (ఫైల్)

నల్లమాడ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎద్దుల వాండ్లపల్లి తండాకు చెందిన ఈ. జయరాంనాయక్ (45) రోడ్డు ప్రమాదంలో గాయపడి.. చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. ఇతను ఈనెల 4న ముదిగుబ్బ మండలంలోని గుడ్డంపల్లి తండాలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వస్తుం డగా మార్గ మధ్యంలో ముదిగుబ్బ సమీపంలో వాహనానికి కుక్క అడ్డు రావడంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అనంతపురంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం అతను మరణించాడు. జయరాంనాయక్‌కు భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

గాయపడిన దంపతులు

కొత్తచెరువు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌనికుంటపల్లి సమీపంలో రైల్వేబ్రిడ్జి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అప్పలవాండ్లపల్లి తండాకు చెందిన దంపతులు సీతారాంనాయక్, సీతాబాయి గాయపడ్డారు. వీరు ద్విచక్రవాహనంలో పుట్టపర్తికి వెళ్తుండగా.. జగరాశిపల్లి నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వీరిని 108 వాహనంలో పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

భద్రతా ఏర్పాట్ల పరిశీలన



ఎయిర్‌పోర్టులో భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

పుట్టపర్తిరూరల్, జనవరి8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, కమ్యూనికేషన్ల మంత్రి నారా లోకేశ్ పర్యటన నేపథ్యంలో ఎస్పీ రత్న శ్రీసత్యసాయి ఎయిర్‌పోర్టులో భద్రతా ఏర్పాట్లను బుధవారం పర్యవేక్షించారు. బుధవారం అనంతపురంలో నిర్వహించే.. నందమూరి బాలకృష్ణ నటించిన చిత్రం డాకూ మహారాజ్ ప్రీ రిలీజ్ ఈవెంటులో ఆయన పాల్గొనేందుకు గురువారం సాయంత్రం 4.00 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయం నుంచి పుట్టపర్తి సత్యసాయి ఎయిర్‌పోర్టుకు వస్తున్నారు. అక్కడి నుంచి ఆయన రోడ్డుమార్గాన కొత్తచెరువు, ధర్మవరం, మీదుగా అనంతపురం వెళ్తారు.

ఆర్టీఏ సేవలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాణి

ధర్మవరం రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వాహనదారుల సౌక ర్యార్థం ధర్మవరంలో మోటర్ వెహికల్ తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఆ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ధర్మవరం మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాణి సూచించారు. బుధవారం తన కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. కార్యాలయంలో ఆన్‌లైన్ సేవలు కూడా అందుబాటులోకి తెచ్చామ న్నారు. కార్యాలయం పరిధిలో ధర్మవరం, బత్తలపల్లి, తాడి మర్రి, కనగానపల్లి, రామగిరి, సీకేపల్లి మండలాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం కార్యాలయంలో ఎల్ఎల్ఆర్‌లు, డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, వాహన ట్రాన్స్‌ఫర్లు, మార్పులు, చేర్పులు, కొత్తగా వాహనాల రిజిస్ట్రేషన్‌లు జరుగు తున్నాయన్నారు. గతంలో ఈ మండలాలకు చెందిన వాహన దారులు వీటి కోసం హిందూపురం, కదిరి ప్రాంతాలకు వెళ్లేవారని, ప్రస్తుతం ధర్మవరంలోనే ఆ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

సాగులో ఉన్నవారికి న్యాయం చేయండి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ దేవేంద్రనాయక్

నంబులపూలకుంట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అసైన్డు భూమిని సాగుచేసుకుంటున్న తమ పేరుతో పాసుపుస్తకాలు మంజూరు చేసి.. న్యాయం చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. బుధవారం మండలంలోని వెలిచెలమల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు వినపత్రాలు అందించారు. అనుభవంలో ఒకరుంటే పాసుపుస్తకంలో మరో రైతు పేరు నమోదు చేశారని, అర్హులైన రైతులకు న్యాయం చేయాలని కోరారు. దీని కోసం కార్యాలయాల చుట్టూ పలుమార్లు తిరిగినా న్యాయం జరగలేదని వాపోయారు. భూములను పరిశీలించి అర్హులైన రైతులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో సర్వేయర్ జిలాన్, ఆర్ఐ శ్రీధర్, వీఆర్‌ఓలు రఘు, దీపిక, నాగరాణి, అనుషా, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

డైట్‌లో సంక్రాంతి సంబరాలు



డైట్‌లో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు

బుక్కపట్నం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా విద్యా శిక్షణా కేంద్రంలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు భోగిమంటలు, కోలాట, సంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు లక్ష్మీనారాయణరెడ్డి, శ్రీనివాసులు, హరినాథ్‌రెడ్డి, ఫ్రాన్సిస్ రాధిక, నీలిమ, శ్రావణి, విద్యార్థులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన

తాడిమర్రి: కిశోరి వికాసం పథకంపై స్థానిక ఎంపీడీఓ కార్యక్రమంలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో సీడీపీఓ సరస్వతి, ఏసీడీపీఓ సునంద, ఎంఈఓ కృష్ణమోహన్, ఎంపీడీఓ రంగారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దేవమణి, లలితమ్మ, చంద్రమ్మ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పాఠశాల ఆవరణలో ముళ్ల పొదల తొలగింపు



ముళ్లపొదలను తొలగిస్తున్న టీడీపీ నాయకులు

గోరంట్ల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాగా రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణంలోని ముళ్లపొదలను, చెత్తచెదారాన్ని టీడీపీనాయకులు బుధవారం తొలగించారు. పాఠశాల పరిసరాల్లో ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు, మురుగునీటి నిలువతో చాల కాలంగా అపరిశుభ్రత నెలకుంది. విషపురుగుల సంచారంతోపాటు, దోమల బెడద కారణంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడేవారు. ఈవిషయాన్ని నూతనంగా ఎన్నికైన స్కూల్‌కమిటీ చైర్మన్ క్రిష్ణవేణి దృష్టికి తీసుకెళ్లగా, ఆమె భర్త టీడీపీ నాయకులు ఆది, వెంకటరామప్ప, నరేంద్ర ఆధ్వర్యంలో ఎక్సకవేటర్ సాయంతో ముళ్లపొదలను తొలగించారు. పాఠశాల పరిసరాలను శుభ్రపరించిన నాయకులకు ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు.

శిథిలావస్థలో కార్యాలయ భవనం



శిథిలావస్థకు చేరుకున్న ఏఈ కార్యాలయం పైకప్పు

పెనుకొండ టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఇళ్లులేని పేదలకు నూతనగృహాలను నిర్మించే ఆశాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఈ సబ్‌డివిజన్ కార్యాలయం ఉంది. అయితే లోపల భాగమంతా శిథిలావస్థకు చేరుకోవడంతో కూర్చోవడానికి వీలులేనంత అధ్వాన్నంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన భవననిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వడిగేపల్లిలో చౌకదుకాణం ప్రారంభం

గోరంట్ల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడిగేపల్లి చౌకధాన్యపు డిపోను టీడీపీ నాయకులు బుధవారం ప్రారంభించారు. 40 ఏళ్లుగా వడిగేపల్లి చౌకధాన్యపు డీపు డీలర్‌గా కాంగ్రెస్, వైసీపీ నాయకులు పనిచేస్తూ వచ్చారు. టీడీపీ అధికారంలోకిరావడంతో మంత్రి సవిత, ఎంపీ పార్థసారధి ఆదేశాలతో కొత్త డీలర్‌గా టీడీపీకి చెందిన చంద్రశేఖర్‌ను నియమించారు. దీంతో టీడీపీనాయకులు చౌకదుకాణాన్ని ప్రారంభించి ప్రజలకు నిత్యవసర వస్తువులు అందించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ నరసింహమూర్తి, జయచంద్ర, మనోహర్, మూర్తి, రామాంజి, చంద్రశేఖర్, ఆదినారాయణ, చంద్రనాయక్, సాలెప్ప, నారప్ప, గిరన్న, లక్ష్మన్న తదితరులున్నారు.

15న గుండె, కంటి వైద్యశిబిరం

పెనుకొండ టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పుట్టినరోజు సందర్భంగా ఈనెల 15న ఉచిత గుండె, కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు తెలిపారు.

ప్రభుత్వ చౌక ధరల ధాన్యం డిపో సీజ్

లేపాక్షి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిత్యవసరాలు అందిస్తున్న ప్రభుత్వ చౌకధాన్య డిపోను సీజ్ చేసినట్లు సీఎ్‌సడీటీ మోహన్‌నాయక్ తెలిపారు. పులమతి పంచాయతీలో డీలర్ అశ్వర్థప్ప, డిపో 1256001 దుకాణాన్ని బుధవారం తనిఖీ చేయగా నిత్యవసరాల వస్తువుల్లో తేడాలున్నాయన్నారు. దీంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం దుకాణాన్ని సీజ్‌చేసి ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు.


ఉద్యాన రైతులకు అవగాహన కల్పించాలి



ల్యాబ్‌లో మట్టి పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

పెనుకొండ రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సీజన్‌లో ఉద్యాన పంటలు సాగుచేసే రైతులకు అవగాహన కల్పించాలని హార్టికల్చర్ అధికారి రాంప్రసాద్.. సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని హార్టికల్చర్ కార్యాలయంలో వివిధ మండలాలకు చెందిన విలేజ్, అగ్రికల్చర్ అసిస్టెంట్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్‌ఓ రాంప్రసాద్ మాట్లాడుతూ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రెయిన్ రీసర్చ్ వారి కిట్ ఉపయోగించి రైతుల పొలాల్లో మట్టి పరీక్షలు 15నిమిషాల్లో జరిపి ఫలితాలనువెలువరించాలన్నారు. అనంతరం సాంకేతికంగా రైతులకు సందేహాలుంటే నివృత్తిచేయాలన్నారు. కార్యక్రమంలో పెనుకొండ, సోమందేపల్లి, రామగిరి, సోమందేపల్లి, మండలాలకు చెందినవారు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి



సమస్యలు తెలియజేయడానికి వచ్చిన విద్యార్థులు

హిందూపురం అర్బన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పరిగి మండల పరిధిలోని సేవామందిరంలో ఉన్న బీసీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏఐడీఎస్‌ఓ నాయకులు బుధవారం హిందూపురంలోని బీసీ వెల్ఫేర్ అధికారి సుబ్బరాయుడుకు వినతిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యలకు అనుగుణంగా హాస్టల్ గదులు లేవన్నారు. మరుగుదొడ్లు సక్రమమంగా లేవని మలమూత్ర విసర్జనకు వెళితే డ్రైనేజీలలోకి వెళ్తున్నాయన్నారు. విద్యార్థులు మరుగుదొడ్ల కోసం బయటికి వెళ్ళాల్సి వస్తోందని, రాత్రి సమయాల్లో క్రిమి కీటకాలతో ప్రమాదముందన్నారు. వెంటనే విద్యార్థులకు తగ్గట్టుగా గదులు ఏర్పాటు చేసి అండర్ డ్రైనేజీలను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ వారం రోజుల్లో పల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా నాయకురాలు పూజిత మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పరుచుకున్న పచ్చదనం

● 500 ఎకరాల్లో వరినాట్లు



వరినాట్లతో పచ్చగా కళకళలాడుతున్న నర్సాపురం పొలాలు

పరిగి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పరిగి చెరువు నిండడంతో ఆ ప్రాంతమంతా వరినాట్లతో కళకళలాడుతోంది. 33ఏళ్ల క్రితం వరి, రాగి పంటలతో ఆ మండలం కళకళలాడుతూ ఉండేది. రాష్ట్ర వ్యాప్తంగా పరిగి మండలం నుంచి వరిధాన్యాన్ని ఎగుమతి చేసేవారు. గత కొన్ని సంవత్సరాల నుంచి ఎగువ కర్ణాటక ప్రాంతాల్లోనూ, స్థానికంగాను వర్షం పడక పోవడంతో పరిగి చెరువు ఎండిపోయి బీడుగా మారింది. 30ఏళ్ల నుంచి చెరువు కట్ట కింద భూములు ఎలాంటి వ్యవసాయం లేకుండా ముళ్లకంపలతో బీడుభూములుగా మారాయి. ఈ కారణంగా రైతులు వ్యవసాయం వదిలేసి పట్టణాలలో, పరిశ్రమల్లో కూలి పనులకు పరుగులుపెట్టారు. 2023-24సంవత్సరాల్లో కర్ణాటక ప్రాంతంల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా జయమంగళినది ద్వారా పరిగి చెరువుకు నీరు చేరి మరువ పారింది. మండల వ్యాప్తంగా 500 ఎకరాలలో వరినాట్లు వేయడంతో అంతటా పచ్చదనంతో పూర్వవైభవం నెలకొంది. వ్యవసాయం చేసే రైతులకు కాకుండా దీంతో పొలాల్లో కూలీ పనులకు వెళ్లే స్థానిక ప్రజలకు ఉపాధి లభిస్తోంది. పనుల కోసం కుటుంబంతో సహా దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడే అవసరం లేకుండా పోయిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. చెరువుల్లో నీరు కాలువల ద్వారా పరిగి ధనాపురం, బీరేపల్లి, కొత్తపల్లి, వన్నంపల్లి, చిన్నపల్లి, నర్సాపురం, విట్టాపల్లి గ్రామ పొలాలకు పారడంతో వరినాట్లు వేయచేయడానికి నీటి సమస్య లేకుండా పోయింది. రాత్రి సమయాల్లో విద్యుత్‌కోసం ఇబ్బందిపడే అవసరం లేకుండా పగటిపూటే పనులు పూర్తిచేసుకుని ఇళ్లకు చేరుకుంటున్నారు.

500ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు: ఏఓ విజయభారతి

మండల వ్యాప్తంగా 500ఎకరాల దాకా రైతులు వరిపంట సాగుచేస్తున్నారు. ప్రతి శుక్రవారం పొలం పిలుస్తోంది.. కార్యక్రమం నిర్వహిస్తూ పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉపయోగించాల్సిన ఎరువులు, మందులు తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

పగటిపూట వ్యవసాయం బాగుంది



సత్యప్రకాశ్, రైతు

చెరువునీటితో దాదాపు 5ఎకరాలు వరిసాగుచేస్తూ గ్రామంలోని దాదాపు 20మంది స్థానిక మహిళలకు పని కల్పిస్తున్నాం. రాత్రి సమయంలో విద్యుత్ వచ్చే వరకు వేచి ఉండకుండా పగటి పూటే పనిచేసి ఇళ్లకు చేరుకుంటున్నాం. పరిగి చెరువు నిండటంతో మిరప, తదితర ప్రత్యామ్నాయ పంటలు సాగుచేస్తున్నాం.

ఐదేళ్లుగా మూతపడ్డ పాలకేంద్రం

పాడి రైతులకు తప్పని ఇబ్బందులు

మడకశిర రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పాల సేకరణ కేంద్రం మూత పడింది. దీంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతకుముందు టీడీపీ పాలనలో పాడి రైతులకు అనుకూలంగా పాల సేకరణ కేంద్రాలు ప్రభుత్వం నిర్వహించేది. రైతుల నుంచి పాలను సేకరిస్తూ ఎప్పటికపుడు బిల్లులు కూడా చెల్లించేవారు. అప్పట్లో ప్రతిరోజు మడకశిర, రొళ్ళ, అగళి, అమరాపురం, గుడిబండ మండలాల నుంచి రోజు 1200 లీటర్ల పాలు సేకరించేవారు. ఐదేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాలశీతలీ కేంద్రాలు మూతబడ్డాయి. ప్రస్తుతం పాలరైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.



మడకశిరలో మూతపడ్డ పాలకేంద్రం

పాలకేంద్రంలో తుప్పుపట్టిన పరికరాలు

వైసీపీ పాలనలో పాల సేకరణ కేంద్రాలు ప్రైవేట్‌కు అప్పచెప్పారు. అప్పటి నుంచి పాల కేంద్రాలు మూతపడ్డాయి. ఐదేళ్లుగా పాల కేంద్రం మూత పడడంతో అందులోని వస్తుసామగ్రి తుప్పుపట్టింది. లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయింది.

పాలు అమ్ముకోవడానికి ఇబ్బందులు: వడాలప్ప, రైతు, ఛత్రం

వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రభుత్వ పాల సేకరణ కేంద్రాలు మూత పడడంతో పాడిరైతులకు అసలైన కష్టాలు మొదలైనాయి. ప్రభుత్వ ప్రోత్సాహం లేక పాడి పరిశ్రమ కుదేలయిపోవడంతో అప్పటి నుంచి చాల మంది రైతులు సొంతంగా పాలను అమ్ము కొంటున్నారు. సరిహద్దు గ్రామాల్లో ఉన్న మరికొంతమంది రైతులు కర్ణాటకకు పాలను తీసుకెళుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పాడి రైతుల కష్టాలు తీర్చడానికి చర్యలు చేపట్టాలని పాడి రైతులు కోరుతున్నారు.

సాయికాళేశ్వర్ ఆశయ సాధనకు కృషి

● గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప
● మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన



కాళేశ్వర్‌కు నివాళులు అర్పిస్తున్న శిల్ప, తల్లి సుబ్బమ్మ

పెనుకొండ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త శివసాయిమందిరం వ్యవస్థాపకుడు దివంగత డా.సాయికాళేశ్వర్ పేద ప్రజల కోసం చేపట్టిన సేవా కార్యక్రమాలను శక్తివంచనలేకుండా అమలు చేయడానికి కృషిచేస్తానని గ్లోబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప పేర్కొన్నారు. బుధవారం స్థానిక కాళేశ్వర్ ఆశ్రమంలో ఆయన 52వ జయంతిని పురస్కరించుకుని గ్లోబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ముందుగా కాళేశ్వర్ చిత్రపటానికి శిల్ప, నవ్యశ్రీ, తల్లిదండ్రులు సుబ్బరాయుడు, సుబ్బమ్మ, పుర ప్రముఖులు, వైద్యులు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. సాయికాళేశ్వర్ పేదలకు ఉచితంగా నేత్రదానం చేయాలనే సంకల్పంతో 2007లో కుమార్తె నవ్యశ్రీ పేరుతో ఉచిత కంటివైద్యశాలను ఏర్పాటు చేసి ఎందరికో నేత్రదానం చేశారన్నారు. ఈ వైద్యశాల ద్వారా నిరంతర సేవలను అందిస్తామన్నారు. ప్రతిరోజూ రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు, కంటి అద్దాలతోపాటు అవసరమైన వారికి నిపుణులచేత అధునాతన పరికరాలతో ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. మొదటి రోజు ఈఎన్‌టి నిపుణులు సుసెనే జర్మని, డెర్మటాలజిస్ట్ డా. క్రిష్టియన్ జర్మని, పంటి వైద్యనిపుణులు డా.రమ్య, డా. సుశిత, టెక్నీసియన్ మార్కస్ జర్మని, రిచర్ట్స్ బెంగళూరు, ఆర్థో ఫ్రాంజిన్ జోసెన్‌రోజ్‌లు శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. 120మంది చెవి వ్యాధిగ్రస్థులను పరీక్షించి 91మందికి వినికిడి యంత్రాలను అందజేశారు. వందమంది చర్మ వ్యాధిగ్రస్తులకు, 60మంది పంటి రోగులకు, 60మంది ఎముకల రోగులకు, పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరం ఈనెల 12వరకు నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరాన్ని అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చిట్టిబాబు, హరి, బాబు ప్రసాద్, ప్రగతి శ్రీనివాసులు పురప్రముఖులు పాల్గొన్నారు.

కాళేశ్వర్‌కు పలువురి ఘననివాళి

ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శివసాయి మందిరం వ్యవస్థాపకుడు డా.సాయికాళేశ్వర్ 52వ జయంతిని పురస్కరించుకుని పలువురు ఆయనకు ఘననివాళులు అర్పించారు. బుధవారం శివసాయి మందిరం ప్రాంగణంలో ఉన్న ఆయన సమాధిని టీడీపీ నాయకులు, పుర ప్రముఖులు దర్శించి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. మెగా వైద్య శిబిరాన్ని సందర్శించి శిల్పకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కుమార్తె నవ్యశ్రీకి గుర్రపుస్వారీలో జాతీయ స్థాయిలో అవార్డు వచ్చిన సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ప్రగతి స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసులు, జాన్‌ప్రియనాథ్, టీడీపీ నాయకులు కన్వీనర్ శ్రీరాములు, రమణమ్మ, సుబ్రహ్మణ్యం, పులగూర్ల శ్రీనివాసులు, తోటగేరి గోపి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవాడ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ

హిందూపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తూముకుంట, గోళ్లాపురం పారిశ్రామిక వాడ అభివృద్ధికి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు డా.సురేంద్ర, టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావులు అన్నారు. బుధవారం తూముకుంటలో పారిశ్రామికవేత్తలతో ఏపీఐఐసీ జెడ్ఎం సోనియాబాయితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ హయాంలో తూముకుంట పారిశ్రామికవాడ ఏర్పాటైందని, అప్పటి నుంచి ప్పటి వరకు అభివృద్ధిపై టీడీపీ దృష్టి పెట్టిందన్నారు. పరిశ్రమలకు అడిగిన వెంటనే భూములుకేటాయించినట్లు తెలిపారు. ముఖ్యంగా పారిశ్రామికవాడలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి, ఫార్మా పరిశ్రమలో వచ్చే వేస్ట్‌వాటర్‌ను శుద్ధిచేసే ప్లాంట్ నిర్మాణానికి స్థలం వెంటనే కేటాయించాలని కోరారు. వీరితోపాటు వంద పడకల ఈఎస్ఐ ఆసుపత్రికి స్థలం ఇవ్వాలన్నారు. దీంతోపాటు పారిశ్రామికవాడలో ఒక ప్రత్యేక అగ్నిమాపక యంత్రం ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు వినతి పంపితే ఎమ్మెల్యే ద్వారా కేటాయించేందుకు కృషిచేస్తామన్నారు. త్వరలోనే పారిశ్రామిక అడ్వైజరి కమిటీని ఎన్నుకునేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశ్రామికవాడలో నీటి సమస్య లేకుండా గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని తెప్పించేందుకు ఎమ్మెల్యే ముఖ్యమంత్రితో మాట్లాడతారని హామీ ఇచ్చారు. అదేవిధంగా ట్రాన్స్‌కో ఎస్ఈ సంపత్‌కుమార్ మాట్లాడుతూ పారిశ్రామికవాడలో సోలార్‌ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు: ఉష

పెనుకొండ రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అక్రమ అరెస్టులు సరికాదని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. రొద్దం మండలం నాగిరెడ్డిపల్లిలో సోషల్ మీడియాలో ప్రజల ప్రక్షాన ప్రశ్నించినందుకు బాలాజీరెడ్డిని అక్రమంగా అరెస్ట్‌చేసి జైలుకు పంపారన్నారు. మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తాను నాగిరెడ్డిపల్లిలోని బాలాజీరెడ్డి ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసా కల్పించానన్నారు. అనంతరం రూ.లక్ష చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు.

వాసవీక్లబ్ అధ్యక్షుడిగా రాజేంద్ర గుప్తా



అధ్యక్షుడిని ఎన్నుకుంటున్న వాసవీక్లబ్ సభ్యులు

హిందూపురం అర్బన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వాసవీక్లబ్ హిందూపురం శాఖ నూతన అధ్యక్షుడిగా రాజేంద్రగుప్తాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం వాసవీక్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు దాసా సందేష్ ఆధ్వర్యంలో హిందూపురంలోని ఆయన దుకాణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విధంగా కార్యదర్శిగా దాసా విష్ణు, కోశాధికారిగా కిరణ్‌లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సమస్యల పట్ల తాము ముందుండి సమస్యల పరిష్కారానికి పాటు పడుతామన్నారు. కార్యక్రమంలో అంతర్జాతీయ డైరెక్టర్ కట్టా అమర్, క్లబ్ మాజీ అధ్యక్షుడు రఘునందన్‌గుప్తా, టీజీ సుబ్రహ్మణ్యం, దాసా గంగాధర్, కేఎన్ సూర్యనారాయణ, రామమూర్తి పాల్గొన్నారు.

క్రికెట్‌లో విజేత ప్రభుత్వ జూనియర్ కళాశాల



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకుంటున్న మూర్తి

పెనుకొండ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్‌కళాశాల జట్టు విజయం సాధించింది. బుధవారం సన్‌రైస్ జట్టు ప్రభుత్వ జూనియర్‌కళాశాల మధ్య జరిగిన పోటీలో మొదట బ్యాటింగ్ చేసిన పెనుకొండ జట్టు నాలుగు వికెట్లు కోల్పోయి 184పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సన్‌రైస్ జట్టు 8వికెట్లు 113రన్నులు చేసి ఓటమి పాలైంది. 43బంతుల్లో 12సిక్స్‌లు, 5ఫోర్లు సాధించిన క్రీడాకారుడు మూర్తి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అందుకున్నాడు. గేమ్‌ఛేంజర్‌గా పవన్ నిలబడ్డాడు.

రేపు వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు పాదయాత్ర

మడకశిర టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఈనెల 10వతేదీన మడకశిర పట్టణం నుంచి రొళ్ల మండలం కొత్తపాళ్యం వెంకటేశ్వరస్వామి దేవాలయం వరకు పాదయాత్రగా వెళుతున్నట్లు బాలాజీ పాదయాత్ర బృందం సభ్యులు తెలిపారు. పట్టణంలోని కొల్లాపురమ్మ దేవాలయం నుండి ఉదయం 7.30 గంటలకు బయలుదేరి చంద్రబావి దత్తాత్రేయస్వామి ఆలయం, నీలకంఠాపురం దేవస్థానాల మీదుగా వెంకటేశ్వరస్వామి ఆలయం చేరుకొని ఉత్తరద్వార దర్శనం చేసుకోనున్నట్లు తెలిపారు. కావున భక్తులు పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు.

టెన్త్ పరీక్షల పట్ల భయం వద్దు

హిందూపురం అర్బన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న పదవతరగతి పరీక్షలు రాసే విద్యార్థులు భయపడకుండా వారిలో స్ఫూర్తిని నింపే కార్యక్రమాన్ని గురువారం ఎంజీఎం పాఠశాలలో నిర్వహించనున్నట్లు నిస్వార్థ ఫౌండేషన్ నిర్వహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహకులు సిద్దగిరి శ్రీనివాసులు, రాజశేఖర్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు అంటేనే విద్యార్థుల్లో తెలియని భయం పుట్టుకొస్తుందన్నారు. అలాంటి పిల్లలను మోటివేషన్ చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు స్వామి బాలచంద్ర హిందూపురం వస్తున్నట్లు తెలిపారు. ఉదయం పది గంటలకు పట్టణ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

వడ్డె ఓబన్న జయంతి ఉత్తర్వులపై హర్షం



సమితి కన్వీనర్ వెంకట్

పెనుకొండ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మొదటి తరం స్వాతంత్ర్య సమరయోధుడు, రేనాటి వీరుడు వడ్డె ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా జీఓ విడుదల చేయడంపై తెలుగుదేశం పార్టీ వడ్డెర సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డె వెంకట్, వడ్డెర సాధికార సమితి స్టేట్ మీడియా కన్వీనర్ పల్లపు మహేంద్రలు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం వారు ఓ ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర్లను గుర్తించి వడ్డెర ఆరాధ్య దైవమైన వడ్డె ఓబన్న జయంతిని జనవరి 11న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో అధికారికంగా నిర్వహించాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు అధికారిక జీవో విడుదల చేసిందన్నారు. ఈ నిర్ణయంపై రాష్ట్ర వడ్డెర సాధికార సమితి తరఫున హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఇందుకు కృషిచేసిన బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవితకు వడ్డెర సాధికార సమితి తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తెలిపారు.

శనీశ్వరుడి విగ్రహం ధ్వంసం



చేయి విరిగిన విగ్రహం

హిందూపురం అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోతుకపల్లి వద్ద శని దేవస్థానానికి వెళ్లే రహదారిలో ఆర్చి వద్ద ఉన్న శనిదేవుడి విగ్రహం కుడి చేతిని గుర్తుతెలియని దుండగులు మంగళవారం రాత్రి విరగకొట్టారు. బుధవారం ఉదయం అటుగా వెళ్లేవారు గమనించి ఆలయ అర్చకుడికి విషయం తెలియజేశారు. అనంతరం గ్రామస్తులు అక్కడకు చేరుకొని రోడ్డుపై బైఠాయించి నిరసన చేయాలని గుమిగూడారు. ఇంతలో విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ రాజగోపాలనాయుడు అక్కడకు చేరుకొని వారిని శాంతింపచేశారు. స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి దుండగులను పట్టుకుంటానన్నారు.

గాయపడ్డ రామాంజినప్పకు పరామర్శ

పావగడ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కరినాడుమిత్ర విలేకరి పావగడ ప్రాంతానికి చెందిన రామాంజినప్పపై ఈనెల 6న పావగడలో జరిగిన దాడిని కర్నాటక మాజీ విద్యాశాఖ మంత్రి ఎన్. మహేష్ బుధవారం ఖండించారు. ఆయన తుమకూరు జిల్లా ఆసుపత్రిలో రామాంజినప్పను పరామర్శించారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. గాయపడిన రామాంజినప్పకు అన్నివిధాలుగా చికిత్సలు అందించి త్వరగా కోలుకోనేలా చేయాలని డీహెచ్‌ఓకు తెలియజేశారు. విలేకరులపై దాడులు అమానుషమని ఇటువంటి వారిపై ఉపేక్షించకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా బీపీఎస్ అధ్యక్షులు కెంచరాయ, ఈరణ్ణ, మంజునాథ, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

క్రైం కార్నర్

వ్యాపారిపై హత్యాయత్నం

హిందూపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): హిందూపురం మండలంలోని తూముకుంట చెరువుకట్ట వద్ద మంగళవారం అర్ధరాత్రి దాటాక పట్టణంలోని దండురోడ్డుకు చెందిన నారాయణరెడ్డి అనే వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. ఆయన ధర్మవరంలో చీరలు తీసుకుని వెళ్లి యలహంకలో పాలిష్ చేయించేవాడు. మంగళవారం బెంగళూరుకు వెళ్లి అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో పూలకుంట చెరువుకట్ట వద్దకు వచ్చారు. అయితే అక్కడకు కొంతమంది వచ్చారు. ఆయన తనకు సన్నిహితంగా ఉండే వ్యక్తికి ఫోన్ చేయగా ఆయనతోపాటు నలుగురు వచ్చి అతన్ని పక్కకు తీసుకెళ్లి అందరూ కలసి మద్యం సేవించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి గొంతును కత్తితో కోశారు. దీంతో తీవ్ర రక్తస్రావమైంది. అయితే హత్యాయత్నానికి పాల్పడినవారు అక్కడి నుంచి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన నారాయణరెడ్డి అటుగా వస్తున్న వేరే వాహనంలో ఆసుపత్రికి వెళ్లాడు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం బెంగళూరుకు తరలించారు. ఇదిలా ఉంటే నారాయణరెడ్డి కొంతకాలం క్రితం మరో వ్యక్తి వద్ద డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. ఈ సందర్భంగా ఇద్దరి ఆర్థికలావాదేవీలే హత్యయత్నానికి కారణమని తెలుస్తోంది. ఇందులో ఐదుగురు పాల్గొన్నట్లు సమాచారం. ఇందులో హిందూపురానికి చెందిన ఇద్దరు, గోరంట్లకు చెందిన ముగ్గురు ఉన్నారని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. వన్‌టౌన్, రూరల్ సీఐలు రాజగోపాల్‌నాయుడు, జనార్దన్.. ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడానికి రెండు బృందాలను ఏర్పాటుచేశారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరికి రిమాండ్



పట్టుకొన్న కర్ణాటక మద్యంతో సీఐ, సిబ్బంది

మడకశిరటౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఇద్దరు బుధవారం ఉదయం 5 గంటల సమయంలో కర్ణాటక నుంచి మడకశిరకు కర్ణాటక మద్యం తరలిస్తుండగా సిబ్బంది పట్టుకొన్నట్లు ఎక్సైజ్ సీఐ ప్రసాదరావు తెలిపారు. పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన నంజప్ప, మారుతి.. కర్ణాటకకు చెందిన 328 90ఎంఎల్ ఒరిజినల్ ఛాయిస్ విస్కీ టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు తెలిపారు. వారిని మడకశిర కోర్టులో హాజరుపర్చగా వారికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ వివరించారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

పెనుకొండ రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పెనుకొండ మండలంలోని గుట్టూరు గ్రామంలో సిరివెన్నెల అనే యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు కియ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ వెంకటరమణ తెలిపారు. గుట్టూరు గ్రామానికి చెందిన సిరివెన్నెల ఇంటర్ పూర్తిచేసి ఇంటివద్దే ఉండేదని, ఉద్యోగానికి ఎందుకు వెళ్లలేదంటూ తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపానికి గురై ఇంటి నుంచి బుధవారం బయటికి వెళ్లిపోయిందని తెలిపారు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ప్రయోజనంలేక పోవడంతో కియా పోలీస్ స్టేషన్‌లో తల్లి కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.